ప్రజాశక్తి

గురువారం 6 నవంబర్ 2025 8 పేజీలు



ప్రకాశం



బాపట్ల

సూర్యలంక బీచ్‌ను

పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలి

బాపట్ల జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్

ప్రజాశక్తి -బాపట్ల

సూర్యలంక బీచ్‌ను మంచి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ వి. వినోద్ కుమార్ అధికారులకు సూచించారు. సూర్యలంక బీచ్ పరిసర ప్రాంతాలను జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్ బుధవారం పరిశీ లించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొంథా తుపాను కారణంగా సూర్యలంక బీచ్‌లో గుంతలు పడి లోతు ఎక్కువగా ఉందన్నారు. అందువల్ల పర్యాటకులను బీచ్ సందర్శనకు నిషేధించినట్లు తెలిపారు. కార్తీక పౌర్ణమి సందర్భంగా ప్రజలను సముద్ర స్నానాలకు, బీచ్ సందర్శనకు అనుమతిపై అధికారులను ఆరా తీశారు. ప్రస్తుతం వాతావరణ పరిస్థితులు మారినందున ఇవే పరిస్థితుల కొనసాగితే రెండు రోజుల్లో బీచ్‌లో ఏర్పడిన గుంతలు పూడిపోతాయని అధికారులు వివరించారు.బీచ్‌లో గస్తీ కోసం పర్యాటక మిత్ర సిబ్బందిని ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. సిబ్బందిని గుర్తించేందుకు యూనిఫాం ఇవ్వాలన్నారు. వారు మాట్లాడు కునేందుకు వాకి టాకీలు అందించాలన్నారు. సూర్యలంక బీచ్‌లో ఉన్న విద్యుత్ స్తంభాలకు సీసీ కెమెరాలు, పబ్లిక్ అనౌన్స్‌మెంట్ సిస్టం పరికరాలు, లైట్లు ఏర్పాటు చేయాలన్నారు. సీసీ కెమెరాలను సూర్యలంక స్టేషన్ హౌస్ ఆఫీసర్‌కులింక్ చేయాలన్నారు. ఈ కార్యక్ర మంలో డిపిఒ ప్రభాకర్, ఆర్‌డిఒ పి. గ్లోరియా, బాపట్ల డిఎస్‌పి రామాంజనేయులు, తహశీల్దారు షేక్ సలీమా తదితరులు పాల్గొన్నారు..



సూర్యలంక బీచ్‌లో పరిశీలిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

పంట నష్టం సగానికి కుదింపు

- 23 వేల హెక్టార్ల నుంచి 12 వేల హెక్టార్లకు తగ్గిన విస్తీర్ణం
- ఎన్యూమరేషన్‌ను పూర్తి చేసిన వ్యవసాయశాఖ

ప్రజాశక్తి-ఒంగోలుబ్యూరో

మొంథా తుపాను వల్ల జరిగిన పంట నష్టాన్ని 12,224.86 హెక్టార్లకు కుదించారు. ప్రాథమిక అంచనా సుమారు 23 వేల హెక్టార్లకు పైనే ఉంది. వర్షాలు తగ్గిన తర్వాత ఎన్యూమరేషన్ చేపట్టారు. ఈ ప్రక్రియలో వీలైనంతమేరకు నష్టం తగ్గించి ప్రభుత్వానికి నివేదికల పంపడం ఆనవాయితీ. ఇపుడూ వ్యవసాయశాఖ అధికారులూ అదే పని చేశారు.పైనుంచి సహజంగా ఉండే పాలనాపరమైన వత్తిళ్లుకూడా కారణంగాఉంటాయి.ఎప్పుడూ జరిగే తంతే ఇపుడూ జరిగింది. దీని వల్ల రైతులు నష్టపోతారు. పంట నష్టం తీవ్రంగానే ఉంది. ఏ పంటా చేతికందే పరిస్థితి లేదు. మళ్లీ పంటలు వేసుకోవాల్సిందే. సజ్జ,జొన్న వంటివి వాటికి సమయం లేదు. కంకిదశలో వర్షానికి ఆవిరైపోయాయి.నష్టం వివరాలను పరిశీలిస్తే మొక్కజొన్న 1158.24 హెక్టార్లలో దెబ్బతిన్నది. కండెలు తడిచిపోయి నల్లగా మారాయి. పత్తి 8087.50 హెక్టార్ల లోనూ, వరి 1465.30, సజ్జ 1345.53 హెక్టార్లలో దెబ్బతింది. మిగిలిన పంటలు స్వల్పంగా దెబ్బతిన్నట్లు చూపారు. నష్టం కింద అనేక పంటలను పరిగణలోకి తీసు కోలేదు. మిర్చి పంట భారీగానే దెబ్బతింది. పచ్చి మిరప కాయలు రాలిపోయాయి. బొప్పాయి తోటలు నీట మునిగాయి.పొగ తోటలూ దెబ్బతిన్నాయి. నష్టాల్లోకి కొన్ని పంటలకు ప్రాధాన్యత లేదంటున్నారు. వ్యవసాయ ▸ 2లో



వర్షానికి తడిసి పాడైన పత్తి కాయలు

పనులు లేక పూట గడవక..

చేనేత కార్మికుల అవస్థలు

▸ 7లో

భూముల రిజిస్ట్రేషన్‌కు అనుమతి

▸ 3లో

నేడు మంత్రి రామానాయుడు జిల్లాకు రాక

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు గురు, శుక్రవారాలలో జిల్లాలో పర్యటించనున్నారు. ఈనెల 6న రాత్రి 7.30 గంటలకు విజయవాడ నుంచి బయలుదేరి 12 గంటలకు వెలిగొండ ప్రాజెక్ట్ అతిథి గృహానికి చేరుకుంటారు. ఈనెల 7న ఉదయం ఏడు గంటలకు దోర్నాల మండలం కొత్తూరు వద్ద తీగలేరు వాగుకు పడిన గండిని పరిశీలిస్తారు. ఉదయం 7.30 గంటల నుంచి 8 గంటల వరకు వెలిగొండ ప్రాజెక్ట్ టన్నెల్స్‌ను మంత్రి అధికారులతో కలిసి సందర్శిస్తారు. అనంతరం వెలిగొండ ప్రాజెక్ట్ క్యాంప్ సైట్‌కు చేరుకుంటారు. ఉదయం 8.10 గంటల నుంచి 9.30 గంటల వరకు వెలిగొండ ప్రాజెక్ట్ క్యాంప్ సైట్‌లో ప్రాజెక్ట్ పురోగతి, ఇటీవల కురిసిన వర్షాలు, చేపట్టిన రక్షణ చర్యలపై అధికారులు, ఏజెన్సీల ప్రతినిధులతో సమీక్ష నిర్వహిస్తారు. ఉదయం 9.30 గంటల నుంచి 10 గంటల వరకూ పాత్రికేయులతో మంత్రి మాట్లాడుతారు.

దళితులపై దాడి అమానుషం

- నిందితులను అరెస్టు చేయాలి
- కేసు నీరుగార్చే యత్నాన్ని సహించం
- కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆంధ్ర మాల్యాద్రి

ప్రజాశక్తి - ఒంగోలు సిటీ

చీమకుర్తి మండలం బండ్లమోటు గ్రామానికి చెందిన దళితులను కులం పేరుతో దూషిస్తూ అగ్రకులానికి చెందిన వ్యక్తులు దాడికి పాల్పడటం అమానుషమని, నిందితులను అరెస్టు చేసి సమగ్ర విచారణ చేపట్టాలని కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆంధ్ర మాల్యాద్రి డిమాండ్ చేశారు. దాడిలో గాయపడి జిజిహెచ్ లో చికిత్స పొందుతున్న కంట్లం ఏసుదాసు, రామయ్య, ఎలిశమ్మ, మరో ముగ్గురు క్షతగాత్రులను బుధవారం కెవిపిఎస్ బృందం పరామర్శించింది. ఘటనకు దారితీసిన విషయాలను బాధితులను అడిగి తెలుసుకున్నారు. సంఘం అండగా ఉంటుందని వారికి భరోసా ఇచ్చారు. అనంతరం ఎల్‌బిజి భవనంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆంధ్ర మాల్యాద్రి మాట్లాడుతూ దళితుల పొలాల్లో గొర్రెలను మేపడంపై ప్రశ్నిస్తే దురుసుగా వ్యవహరించడంతో పోలీసు కేసు పెట్టినందుకు కులం పేరుతో దూషిస్తూ అత్యంత పాశవికంగా దాడికి పాల్పడిన ఒనిపెంట శ్రీనివాసులురెడ్డి, ఓబుల్ రెడ్డి తదితరులను అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కేసు నమోదు చేసి మూడు రోజులవుతున్నా ఒంగోలు డిఎస్‌పి ప్రాథమిక విచారణ చేపట్టకుండానే అగ్రకుల దాడిని ఇరువురు వ్యక్తుల మధ్య వివాదంగా ప్రకటించడం హాస్యాస్పదంగా ఉందని ఆరోపించారు. ఈ ఘటనపై సోషల్ మీడియాలో పోస్టులు పెడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించడం కేసును నీరు గార్చే చర్యగా ఆయన దుయ్యబట్టారు. అగ్ర కులానికి చెందిన వారి గొర్రెలు మాదిగల చేలో మేపడం నిజం కాదా? న్యాయం ▸ 2లో



మాట్లాడుతున్న అంధ్ర మాల్యాద్రి

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఏసిబి దాడులు

రూ. 48 వేల నగదు స్వాధీనం

ప్రజాశక్తి - ఒంగోలు సబర్బన్

ఒంగోలు సబ్ రిజిస్టర్ కార్యాలయంలో ఏసిబి అధికారులు బుధవారం దాడులు నిర్వహించారు. ఏసిబి ఇన్‌స్పెక్టర్ బి. రమేష్ బాబు, సిహెచ్. శేషు ఆధ్వర్యంలో ఈ దాడులు నిర్వహించారు. అధికారులు సోదాలు ప్రారంభించగానే కొంతమంది సిబ్బంది తమ వద్ద ఉన్న అదనపు నగదును విసిరి వేశారు. కార్యాలయం ప్రాంగణంలో రూ.18 వేలు, కార్యాలయం వెలుపల రూ. 30 వేలు కలిపి మొత్తం రూ. 48 వేల రూపాయలు అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ నగదును ప్రభుత్వానికి జమ చేస్తామని అధికారుల తెలిపారు.



నగదును స్వాధీనం చేసుకుంటున్న అధికారులు



కార్యాలయం బయట పడేసిన నగదు

సోదాల సందర్భంగా తాము గుర్తించిన లోపాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని ఇన్‌స్పెక్టర్ రమేష్ బాబు తెలిపారు. ఈ దాడుల్లో ఏసిబి సబ్ ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇబ్బంది పడిన ప్రజలు

కార్తీక పౌర్ణమి మంచి రోజు కావడంతో రిజిస్ట్రేషన్ల కోసం ప్రజలు పెద్ద సంఖ్యలో కార్యాలయానికి వచ్చారు. ఏసిబి దాడు నేపథ్యంలో రిజిస్ట్రేషన్లు నిలిచిపోవడంతో వారు ఇబ్బంది పడ్డారు.

పంట నష్టం సగానికి కుదింపు

(మొదటిపేజీ తరువాయి)

శాఖ లోతుగా పరిశీలించి నష్టాలను అంచనా వేయాలని రైతులు కోరుతున్నారు. పంటలు నష్టపోయిన రైతులు 16,549 మందిగా తేలారు. వీరికి పరిహారం అందనుంది. రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు పంటను బట్టి హెక్టారుకు గరిష్టంగా రూ.17 వేలు వరకూ నష్టపరిహారం అందనుంది. పంటలు నష్టపోయిన రైతులను ఎలా ఆదుకుంటామనే విషయంపై ప్రభుత్వం ఇంత వరకూ ప్రకటన చేయలేదు.ఇతర శాఖలకూ భారీగానే ముంపు వల్ల నష్టం జరిగింది.

దళితులపై దాడి అమానుషం

(మొదటిపేజీ తరువాయి)

చేయమని మాదిగలు కేసు పెట్టడం నిజం కాదా? కులం పేరుతో దూషిస్తూ పోలీస్ సమక్షంలో మూక దాడులకు తెగబడటం నిజం కాదా అని ఆయన ప్రశ్నించారు. మాదిగలపై అక్కసుతో దాడులకు తెగబడ్డ శ్రీనివాసులు రెడ్డి, ఓబుల్ రెడ్డి తదితరులను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలు చోటుచేసుకున్నపుడు చట్టప్రకారం జిల్లా కలెక్టర్, ఎస్‌పి జోక్యం చేసుకుని ఘటనా స్థలాన్ని సందర్శించి చర్యలు తీసుకోవాల్సి ఉందన్నారు. అలాంటి ప్రయత్నం చేపట్టక పోవడం విచారకరమన్నారు. తక్షణమే కలెక్టర్, ఎస్‌సి గ్రామాన్ని సందర్శించి బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. సాంఘిక సంక్షేమశాఖ మంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న జిల్లా, ఎస్‌సి ఎమ్మెల్యే ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంలో ఇలాంటి ఘటనలు చోటుచేసుకుంటే వారు నోరు మెదపకపోవడం విచారకరమన్నారు. రాష్ట్ర హోం మంత్రి నియోజకవర్గంలో సెల్ ఫోన్ దొంగిలించిన నేరానికి దళితుడిపై దాడి చేయడం, ఉప ముఖ్యమంత్రి నియోజక వర్గమైన పిఠాపురంలో మాలలను వెలివేయడం లాంటి ఘటనలు జరుగుతున్నా ఎస్‌సి కమిషన్ చైర్మన్ జవహర్ ఎందుకు నోరు విప్పడం లేదని ఆయన ప్రశ్నించారు?. మాదిగల పక్షం వహించే కృష్ణ మాదిగ ఈ దాడులపై ఎందుకు మౌనం వహిస్తున్నారని ప్రశ్నించారు? ఈ కేసును నీరు గార్చే ప్రయత్నాలను సహించబోమని, అన్ని ప్రజా సంఘాలను సమీకరించి రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి బి. రఘురామ్ మాట్లాడుతూ ఆరుగురు మాదిగలపై అత్యంత కిరాతకంగా చేసిన దాడిని పోలీసులు నీరు గార్చాలని చూస్తున్నారని ఆరోపించారు. మాదిగలపై జరిగిన దాడిపై ఎలాంటి ప్రాథమిక విచారణ చేపట్టకుండా ఇరుపక్షాలపై కేసులు నమోదు చేయడం సరికాదన్నారు. దాడికి పాల్పడిన వారిపై ఎస్‌సి,ఎస్‌టి అట్రాసిటీ కేసు నమోదు చేయాలన్నారు. నిందితులను అరెస్టు చేసి బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు ఈ సమావేశంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఆట్లూరి రాఘవులు పాల్గొన్నారు.



భారీగా నిలిచిన వాహనాలు

భారీగా నిలిచిన ట్రాఫిక్

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

బుధవారం కార్తీక పౌర్ణమి కావడంతో జిల్లాతో పాటు రాష్ట్ర నలుమూలల నుంచి ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు శ్రీశైలానికి పోటెత్తారు. ఈ క్రమంలో మంగళవారం రాత్రి పలు ప్రైవేటు వాహనాలు ఆర్టీసీ బస్సులు ప్రయాణికులతో దోర్నాల చేరుకున్నాయి. దోర్నాల నుంచి శ్రీశైలం వెళ్లేందుకు రాత్రి 9 నుంచి ఉదయం 6 గంటల వరకు ఎటువంటి వాహనాలకు కొండపైకి అనుమతిం చరు. దీంతో కిలోమీటర్ మేర వాహనాలు నిలిచిపోయాయి. ఉదయం 6 గంటలకు గేటు తెరవగానే వాహనాలన్నీ ఒక్కసారిగా బయలుదేరడంతో భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. ఎస్ఐ వి మహేష్, ఫారెస్ట్ సిబ్బంది ఆధ్వర్యంలో ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

మహిళలకు ఉచిత కోర్సులు

ప్రజాశక్తి-సంతనూతలపాడు

మండలంలోని ఎండ్లూరు డొంక వద్ద గల మహిళా ప్రాంగణంలో మహిళలకు అసి స్టెంట్ బ్యూటీ థెరపిస్ట్, హ్యాండ్ ఎంబ్రాయి డరీ, ఫాబ్రిక్ కట్టర్ అనే పలు కోర్సులపై ఉచితంగా శిక్షణ ఇస్తున్నట్లు మహిళా ప్రాం గణం జిల్లా మేనేజర్ కే మాధవి తెలిపారు. కావున జిల్లాలోని 15 నుంచి 45 సంవత్స రాల లోపు వయసు గల మహిళలు అంద రూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకో వాలని ఆమె కోరారు. మరిన్ని వివరాలకు 6302733492, 9000850869 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక

ప్రజాశక్తి-పుల్లలచెరువు: పీఎంశ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పుల్లలచెరువు ఒకేషనల్ ఎడ్యుకేషన్ విభాగంలో స్కూల్ లెవెల్ స్కిల్ కాంపిటీషన్లో ఐటీ, బిఎఫ్ఎస్ఐ మరియు హెల్త్ కేర్ ట్రేడ్ నుంచి విద్యార్థులు వైష్ణవి, జ్యోతి, జాస్మిన్, వెంకటలక్ష్మి, శృతి, నందిని, ఆసియా ఎన్నికయ్యారు. ఈ నెల 7న జరిగే జిల్లా స్థాయిలో జరిగే పోటీలకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకట ప్రభాజీ ఈ విద్యార్థులను ఎంపిక చేశారు. ఒకేషనల్ ట్రైనర్స్ వైసిహెచ్ మల్లికార్జున, శివాంజనేయులు, యోసేపు విద్యార్థులకు శిక్షణ ఇచ్చి వారిని పోటీలకు తీసుకెళ్లారు.



డిఇఒకు వినతిపత్రం అందజేస్తున్న ఫ్యాప్టో నాయకులు

విపత్తు సెలవుల భర్తీ అవసరం లేదు

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

ప్రస్తుత విద్యా సంవత్సరానికి రాష్ట్ర విద్యాశాఖ నిర్ణయించిన 220 పని దినాలు ఇప్పటికే సరిపోతాయని, కనుక విపత్తు సెలవులను భర్తీ చేయనవసరంలేదని ఫ్యాప్టో విజ్ఞప్తి చేసింది. బుధవారం సాయంత్రం ఆ మేరకు ఫ్యాప్టో జిల్లా నాయకులు డిఇఒ ఏ.కిరణ్ కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ విద్యా సంవత్సరం జూన్ నుంచి అక్టోబర్ వరకు 95 పని దినాలు పూర్తి కాగా, మరో 130 పని దినాలు జరగనున్నందున విద్యార్థుల శిక్షణపై ఎటువంటి ప్రభావం ఉండదని ఫ్యాప్టో నాయకులు వివరించారు. ఏకోపాధ్యాయ పాఠశాలలో సింగిల్ టీచర్స్ ఎదుర్కొంటున్న ఒహెచ్ సెలవుల సమస్యలపై తగు చర్యలు తీసుకుంటామని, సంబంధిత ఎంఇఒలతో మాట్లాడి పరిష్కారం చూపిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఫ్యాప్టో జిల్లా బాధ్యులు ఎస్‌కే అబ్దుల్ హై, డి.శ్రీనివాసులు, చల్లా శ్రీను, పి.వి.సుబ్బారావు, పి.హనుమంతరావు, ఎస్‌కే ఖాదర్ బాషా, నల్లూరి వెంకటేశ్వరరావు, యు.సుబ్బయ్య, ఏ.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.



హాస్పిటల్‌ను ప్రారంభిస్తున్న సీదిరి అప్పలరాజు

శ్రీసాయికృష్ణ హాస్పిటల్ ప్రారంభోత్సవం

ప్రజాశక్తి-కనిగిరి : కనిగిరి పట్టణంలోని పామూరు రోడ్డులో నూతనంగా నిర్మించిన శ్రీ సాయి కృష్ణ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ప్రారంభోత్సవ కార్యక్రమం గురువారం ఘనంగా జరిగింది. రాష్ట్ర మాజీ మంత్రి వైసిపి వైద్య విభాగం రాష్ట్ర అధ్యక్షులు సీదిరి అప్పలరాజు, వైసిపి రాష్ట్ర నాయకులు వైవి భద్రారెడ్డి, కనిగిరి మాజీ ఎమ్మెల్యే కదిరి బాబురావు, మున్సిపల్ చైర్మన్ షేక్ అబ్దుల్ గఫార్‌లు హాస్పటల్ ప్రారంభించారు. హాస్పిటల్‌లో క్యాజువాలిటీ విభాగాన్ని ఆంధ్రప్రదేశ్ వైసీపీ సెంట్రల్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ నెంబర్ చింతలచెరువు సత్యనారాయణ రెడ్డి, మాజీ మంత్రి ముక్కు కాశిరెడ్డిలు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు డాక్టర్ మురళీకృష్ణకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా హాస్పిటల్ అధినేత డాక్టర్ పెరుగు మురళీ కృష్ణ, డాక్టర్ యన్నాబత్తిన హరితలు మాట్లాడుతూ కనిగిరి ప్రాంతంలో ఆధునిక వైద్య సేవలను తెచ్చామన్నారు.

భూముల రిజిస్ట్రేషన్లకు అనుమతి

ఆర్డర్ కాపీని రైతులకు అందజేసిన జెసి
మూలగుంటపాడు ప్రజల హర్షం

ప్రజాశక్తి-శింగరాయకొండ

శింగరాయకొండ మండలం మూలగుంటపాడు గ్రామంలో గత ప్రభుత్వ హయాంలో చేసిన రీసర్వే కారణంగా రిజిస్ట్రేషన్లు ప్రభుత్వం నిలిపివేసింది. ఎట్టకేలకు రైతుల పోరాటంతో రిజిస్ట్రేషన్లు చేసుకునే విధంగా అధికారులు అనుమతి ఇచ్చారు. ఈ మేరకు జెసి గోపాలకృష్ణ రోణంకి రైతులకు ఆర్డర్ కాపీ అందజేశారు. సమస్య పరిష్కారానికి కృషి చేసి మంత్రి స్వామి, మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య, జెసి గోపాలకృష్ణ రోనంకి, తహసీల్దారు ఎన్‌విబి రాజేష్‌లకు మూలగుంటపాడు గ్రామస్తులు కతజ్ఞతలు తెలిపారు. సుమారు సంవత్సరం నుంచి మూలగుంటపాడులో రిజిస్ట్రేషన్లు నిలిపివేయడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అధికారులు మారుతున్నప్పటికీ సమస్యను అలాగే వదిలేయకుండా గ్రామస్తులు ఎప్పటికప్పుడు అర్జీలు తీసుకొని జిల్లా కలెక్టర్ కార్యాలయం నుంచి అమరావతి వరకు కదిలి సాధించుకున్నారు. ఈ కార్యక్రమంలో మూలగుంటపాడు గ్రామ పార్టీ అధ్యక్షుడు సన్నిబోయిన మల్లికార్జున, నరాల సుధాకర్, సన్నిబోయిన రమేష్, లక్ష్మణ్, శ్రీహరి, ఆర్ఐ, విఆర్ఓ, సర్వేయర్ మరియు తదితరులు పాల్గొన్నారు.



ఆర్డర్ కాపీని అందజేస్తున్న జాయింట్ కలెక్టర్

ప్రజాశక్తి పేపర్ పట్టుకొని అధికారుల చుట్టూ..

మూలగుంటపాడులో రీసర్వే కారణంగా నిలిచిపోయిన రిజిస్ట్రేషన్ సమస్య పరిష్కరించాలని గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు నరాల సుధాకర్ అర్జీ పట్టుకొని శింగరాయకొండ, ఒంగోలు, అమరావతి తిరిగి సాధించుకున్నారు. ప్రజాశక్తిలో గత డిసెంబరు 2న ‘ భూముల రీసర్వే కారణంగా నిలిచిన రిజిస్ట్రేషన్లు ’ అనే వార్త ప్రచురించడం జరిగింది. అప్పటినుంచి ఇప్పటివరకు ఆ వార్త వచ్చిన ప్రజాశక్తి పేపరును పట్టుకొని నరాల సుధాకర్ శింగరాయకొండ తహశీల్దారు కార్యాలయంలో, జిల్లా కలెక్టర్ కార్యాలయంలో, మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామికి, మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్యకు వినతిపత్రాలు అందజేశారు. ప్రతి సోమవారం గ్రీవెన్స్ కార్యక్రమానికి హాజరవుతూ వినతిపత్రం అందజేస్తూ వచ్చారు. ఇటీవల కాలంలో మంత్రి స్వామి, దామచర్ల సత్య ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకోవడంతో అధికారులు స్పందించారు. రిజిస్ట్రేషన్ సమస్య పరిష్కారం కావడానికి ప్రధాన కారకులైన ప్రజాశక్తికి నరాల సుధాకర్‌కి గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

7 నుంచి రాష్ట్రస్థాయి షూటింగ్ పోటీలు

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

69వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి షుటింగ్ టోర్నమెంట్-కమ్-సెలెక్షన్స్ ఈ నెల 7 నుండి 9 వరకు ఒంగోలు నెక్స్ట్ జనరేషన్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో జరగనున్నాయి. ఈ కార్యక్రమ ఏర్పాట్లపై జిల్లా విద్యాశాఖాధికారి ఏ.కిరణ్‌కుమార్, జిల్లా స్కూల్ గేమ్స్ సెక్రటరీస్ డాక్టర్ చక్కా వెంకటేశ్వర్లు, ఏ.శిరీష కుమారి బుధవారం రాత్రి జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు ను కలసి వివరాలు తెలియజేశారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి సుమారు 700 మంది క్రీడాకారులు, కోచ్‌లు, అధికారులు పాల్గొననున్నారని తెలిపారు. క్రీడాకారుల కోసం వసతి, భోజనం, రవాణా వంటి ఏర్పాట్లు పూర్తయ్యాయని పేర్కొన్నారు. టోర్నమెంట్ విజయవంతం కావాలని కలెక్టర్ రాజాబాబు అధికారులకు సూచించారు. రాష్ట్రస్థాయి ప్రజాప్రతినిధులు, మంత్రులు కూడా ఈ వేడుకలో పాల్గొననున్నట్లు అధికారులు తెలిపారు.



వివరాలు పరిశీలిస్తున్న కలెక్టర్ రాజాబాబు

యాప్‌లో సెలవు సౌకర్యం కల్పించాలి

ప్రజాశక్తి-సిఎస్‌పురం

మెగా డీఎస్సీ ద్వారా నియామకమైన నూతన ఉపాధ్యాయులకు ప్రస్తుతం సెలవు సౌకర్యం లీప్ యాప్‌లో అందుబాటులో లేకపోవడం వలన వారు సెలవులు దరఖాస్తు చేసుకునే విషయంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఈ సమస్యను వెంటనే పరిష్కరించాలని ఏపీటీఎఫ్ సిఎస్.పురం మండలశాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తోట శ్రీనివాసులు, జెఎస్.ఆనంద్‌బాబు, జిల్లా కార్యదర్శి షేక్.నాయబ్‌రసూల్ ప్రభుత్వాన్ని కోరారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షులు తోట శ్రీనివాసులు మాట్లాడుతూ ఉపాధ్యాయుల ఉన్న సెలవులను వినియోగించుకోవడానికి ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకుని, సెలవు సౌకర్యం యాప్‌లో అందుబాటులోకి తేవాలని ఆయన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.



నిర్మానుష్యంగా మారిన సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం

ఒంగోలులో ఏసీబీ దాడులు..
శింగరాయకొండలో పరుగులు

ప్రజాశక్తి-శింగరాయకొండ

అక్కడ ఒంగోలు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో బుధవారం ఏసీబీ దాడులు జరగడంతో శింగరాయకొండ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద పరుగులు తీశారు. కార్తీక పౌర్ణమి రోజున రిజిస్ట్రేషన్లు చేయించుకునేందుకు చాలా మంది ఉదయం కార్యాలయానికి వచ్చారు. అయితే ఒంగోలులో ఏసీబీ దాడులు జరగడంతో వాళ్లు ఇక్కడకూ వస్తారన్న పుకారుతో కార్యాలయం మొత్తం ఖాళీ అయింది. కార్యాలయంలో ఉన్న నలుగురు ఐదుగురు తప్ప మిగతా వాళ్లంతా అక్కడ నుంచి వెళ్లిపోయారు. కార్యాలయం బయట ఉన్న డాక్యుమెంట్ రైటర్స్ కూడా ఆ పరిసర ప్రాంతాల్లో కనిపించకపోవడం విశేషం. ఒంగోలులో దాడులు జరిగితే ఇక్కడ కార్యాలయం దగ్గర పరుగులు తీయడం తెలిసిన ప్రతి ఒక్కరూ ముక్కున వేలేసుకుంటున్నారు.

వదంతులు సృష్టిస్తే కఠిన చర్యలు

ప్రజాశక్తి-టంగుటూరు : అంబేద్కర్ విగ్రహాన్ని పడగొడుతున్నారని ఏవరైనా వదంతులు సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహశీల్దార్ ఆంజనేయులు, ఎస్ఐ నాగమల్లీశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. అంబేద్కర్ విగ్రహమునకు గానీ, అక్కడ ఉన్న స్థలమునకు గానీ, ఏవర్నించి ఏటువంటి ఇబ్బందులు కలగవని తెలిపారు.



జెండాను ఆవిష్కరిస్తున్న డివైఎఫ్ఐ నాయకులు

డ్రగ్స్‌కు వ్యతిరేకంగా ఉద్యమించాలి

ప్రజాశక్తి-కనిగిరి: డివైఎఫ్ఐ 46వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా బుధవారం కనిగిరి పట్టణంలో డివైఎఫ్ఐ జెండాను పట్టణ నాయకులు ధర్మయ్య ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రకాశం జిల్లా ఉపాధ్యక్షులు పి.నరేంద్ర మాట్లాడుతూ దేశంలో నిరుద్యోగం రోజు రోజుకు పెరుగుతున్న ప్రభుత్వాలు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. డ్రగ్స్ రహితం సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ప్రకృతి వైపరీత్యాలు, ప్రమాదాలు సంభవించినప్పుడు శక్తి మేరకు సహాయ సహకారాలు అందిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ శాఖల్లో ఖాళీలు భర్తీ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రాబోయే రోజుల్లో యువత సమస్యలపై పెద్ద ఎత్తున పోరాడేందుకు సన్నద్ధం కావాలని వారు తెలిపారు. కార్యక్రమంలో కనిగిరి పట్టణ కార్యదర్శి నెహ్మత్, నంద కిషోర్, నవీన్, చంటి, వలి, మహేంద్ర, రమణయ్య, వెంకట్, టోపీవలి, వెంకటేశ్వర్లు రాము పాల్గొన్నారు.



స్రవంతిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

వక్తృత్వ పోటీల్లో విద్యార్థిని ప్రతిభ

ప్రజాశక్తి-మద్దిపాడు : జిల్లా స్థాయిలో నిర్వహించిన వక్తృత్వ పోటీల్లో మద్దిపాడు ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థి స్రవంతి ప్రథమ స్థానం సాధించింది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ బుధవారం స్రవంతిని అభినందించారు. కళాశాల కీర్తి ప్రతిష్టలను జిల్లా స్థాయిలో చాటి చెప్పినందుకు ఆమెను సత్కరిస్తున్నామని ఆయన తెలిపారు.

తుపానును సమర్థవంతంగా ఎదుర్కొన్నాం : ఎమ్మెల్యే

అధికారులు, సచివాలయ సిబ్బందికి ప్రశంసాపత్రాలు

ప్రజాశక్తి-మద్దిపాడు

తుఫానును సమర్థవంతంగా ఎదుర్కొన్నామని, దీనివలన నియోజకవర్గానికి మంచి పేరు వచ్చిందని ఎమ్మెల్యే బిఎన్ విజయ్ కుమార్ తెలిపారు. మండల కేంద్రమైన మద్దిపాడులోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో బుధవారం ఉత్తమ సేవలు అందించిన మండల అధికారులు, సచివాలయ సిబ్బంది అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ భవిష్యత్తులో ఎలాంటి తుఫానులు వచ్చిన సమర్థవంతంగా ఎదుర్కొంటామని స్పష్టం చేశారు. వైసిపి హయాంలో గుండ్లకమ్మ గేట్లు కొట్టుకుపోయాయని దీనివలన డ్యామ్ ఖాళీ అయిందని చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే గుండ్లకమ్మ గేట్లు బిగించి నీటిని నిల్వ చేసామని తెలిపారు. దాదాపు 1,50,000 క్యూసెక్కుల నీళ్లు గేట్లు ద్వారా కిందకు విడుదల చేశామని అన్నారు. ఆ సందర్భంలో కూడా ఎవరికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా జిల్లా ఉన్నతాధికారుల సూచనల మేరకు అధికారులు, వారి సిబ్బంది రాత్రింబవళ్లు కష్టపడి పని చేసి చేశారని తెలిపారు. అధికారులు, సచివాలయ సిబ్బంది కృషికి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా మండల స్పెషల్ ఆఫీసర్, అగ్రికల్చర్ మార్కెటింగ్ ఎడి వరలక్ష్మి, ఎంపీడీవో జ్యోతి మాట్లాడుతూ తుఫాన్ నేపథ్యంలో వాళ్లు ఎదుర్కొన్న సవాలను వాటిని అధిగమించిన తీరును వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బిఎన్ విజయ్ కుమార్ అధికారులను సన్మానించి మెడల్స్, ప్రశంస పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పొగాకు ఉత్పత్తిదారుల సహకార సమాఖ్య చైర్మన్ మండవ జయంత్ బాబు, టిడిపి మండల అధ్యక్షులు ఉప్పుగుండూరి నాగేశ్వరరావు, మండల సెక్రటరీ మందపల్లి శ్రీనివాసరావు, టిడిపి సీనియర్ నాయకులు పోతినేని శ్రీనివాసరావు, మల్లవరం శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ చైర్మన్ మర్నేని రాఘవ, క్లస్టర్ ఇంచార్జి దేవభక్తుని ప్రసాద్, రెప్పవరపు ప్రభాకర్, మాజీ ఎంపీటీసీ పెనుమాక సుధాకర్, నవ్వులూరి శివకృష్ణ,గట్టినేని అయ్యన్న, వడ్డంపూడి శ్రీనివాసరావు, నైనాల భావనారాయణ, దొప్పా శేషయ్య, రాయపాటి శ్రీనివాసరావు,దుగ్గినేని నరసింహారావు,గోరంట్ల చిరంజీవి, సర్పంచులు మండవ శివానందరావు,కాకర్ల విజయ్, సుబ్బారెడ్డి, రాము, రామాంజనేయులు, సుబ్బారావు, నందిగం కోటయ్య, ప్రభాకర్ రెడ్డి,కృష్ణమోహన్ రెడ్డి,దాట్ల శివరామ రాజు, మోపర్తి లాలూ,గడ్డం రవి,దాసరి రమేష్, బేతనంపూడి రాము,ఎద్దు సురేష్, వినోద్, సురేష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయ్ కుమార్

శనగలను ప్రభుత్వమే కొనుగోలు చేయాలి

రైతు సంఘం మండల మహాసభ డిమాండ్

ప్రజాశక్తి - ఇంకొల్లు

ప్రభుత్వాలు ఏవైన పాలకొల్లు రైతులను భూమి నుంచి తరిమేసే ప్రయత్నాలు చేస్తున్నారని, అన్నం పెట్టే రైతును చిన్నచూపు చూస్తున్నారని, ఆరుగాలం శ్రమించి పండించిన పంట అమ్ముకోలేక రైతులు అప్పుల పాలవుతున్నారని ఎపి రైతు సంఘం నాయకులు జయంతి బాబు అన్నారు. రైతు సంఘం మండలం 3వ మహాసభ బాచిన కోటేశ్వరరావు అధ్యక్షతన స్థానిక మాదాల అంజయ్య భవనంలో బుధవారం నిర్వహించారు. సభలో జయంతి బాబు మాట్లాడుతూ అందరూ ఆనందంగా జీవించాలని రైతు ఏరువాక వ్యవసాయాన్ని ప్రారంభించి పంటలు పండిస్తాడని, ఆ రైతు ఆరుగాలం పండించిన పంట చూసి సంతోషపడతాడని అన్నారు. అనావృష్టి, అతివృష్టికి శ్రమించి పండించిన పంటలకు గిట్టుబాటు ధర లేక ప్రకృతి విపత్తులు రైతును అతలాకుతలం చేస్తున్నాయని అన్నారు. రైతులను భూమి నుండి తరిమేసే ప్రయత్నం చేస్తూ బలవంతంగా రైతుల నుండి భూములు లాక్కుంటున్నారని అన్నారు. ప్రకాశం జిల్లా కరేడు భూముల విషయంలో రైతులు తమ భూములు ఇవ్వమని అన్నా ప్రభుత్వాలు బలవంత పెట్టి భూముల్లోనికి రాకుండా చేసే ప్రయ త్నాలు రైతులు గమనిస్తున్నారని తెలిపారు. తమది రైతు ప్రభుత్వమని, రైతే రారాలు అంటున్న అది కేవలం ప్రకటనలకు మాత్రమే పరిమితం అవుతుందని అన్నారు.



మాట్లాడుతున్న రైతు నాయకుడు జయంతిబాబు

ప్రతి రైతు ఇంట కన్నీరు మిగులుతుందని అన్నారు. కూటమి ప్రభుత్వం కూడా అదే పందాలో నడుస్తుందని అన్నారు. వైఎస్ఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో చీరాలలో వాన్‌పిక్ సంస్థకు రైతుల భూములు బలవంతంగా సేకరించిందని అన్నారు. ఈరోజుకి ఆ భూముల్లో ఒక ఫ్యాక్టరీ గాని, ఒక కుటుంబానికి ఉద్యోగం కానీ చూపిన పరిస్థితి లేదని అన్నారు. రాష్ట్రంలో అనేకచోట్ల రైతుల భూములు ప్రైవేటు సంస్థలకు ఇవ్వడానికి కూటమి ప్రభుత్వం అనుసరిస్తుందని అన్నారు. రైతు సంఘం జిల్లా కార్యదర్శి తలపనేని రామారావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం కూడా రైతుల పట్ల ప్రేమ చూపిస్తున్నట్లు చెబుతున్నప్పటికీ కార్పొరేట్ రేట్ సంస్థలకు కొమ్ము కాస్తూ ప్రభుత్వ సంస్థలను ప్రైవేటు పరం చేయటానికి అత్యుత్సాహంగా ఉందన్నారు. నాటి నుండి నేటి వరకు రైతు సంఘం ఆధ్వర్యంలో అనేక సమస్యలపై రైతులకు అండదండగా ఉద్యమాన్ని నిర్మిస్తున్నట్లు తెలిపారు. ప్రకృతి విపత్తుల వల్ల నష్టపోయిన రైతులకు తక్షణ సహాయం అందించాలని డిమాండ్ చేశారు. రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కందిమల్ల రామకోటేశ్వరరావు మాట్లాడుతూ రైతుల సమస్యలు తొలగించుకోవటానికి పోరాటాలే సరైన మార్గమన్నారు. రైతులు రాజకీయాలకు అతీతంగా రైతు సంఘాన్ని బలోపేతం చేసుకొని రైతు సంఘాన్ని బలోపేతం చేసుకొని రైతుల ఆత్మగౌరవం కాపాడుకోవాల్సిన పరిస్థితి ఉందన్నారు. మన ప్రాంతాల్లో రైతు సమస్యలను రైతు సంఘాలే ముందు ఎత్తిచూపుతాయని అన్నారు. అందుకు ఉదాహరణ నల్లబర్లి పొగాకు సమస్యని తెలిపారు. రైతు సంఘం ఉద్యమం గమనించి తప్పనిసరి పరిస్థితుల్లో మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలుకు ప్రభుత్వం ఉపక్రమించిందని అన్నారు. ప్రస్తుతం శనగలు గిట్టుబాటు ధరకు ప్రభుత్వం కొనాలని, అందుకు ప్రభుత్వం ముందుకు రాకుంటే పోరాటం ముందుకు తీసుకుపోవాలని అన్నారు. సమావేశంలో రైతు సంఘం నూతన అధ్యక్షులు బాచిన కోటేశ్వరరావు, కార్యదర్శిగా తన్నీరు గోవిందరాజులు, అన్యం ఆదెయ్య, మాదాల అంజయ్య, మక్కిన హరిబాబు, చిలుకూరు శ్రీనివాసరావు, ఆదినారాయణ, ఎర్రం గోవిందరెడ్డి, కొల్లూరి హనుమంతరావు, ముప్పరాజు శ్రీనివాసరావు, బసివి రెడ్డి, వలేటి అంజయ్య ఎన్నికయ్యారు. సభలో ఎర్రం గోవిందరెడ్డి, పేర్ని నాగేశ్వరరావు, సిఐటియు నాయకులు నాగండ్ల వెంకట్రావు పాల్గొన్నారు.



ఈసీకి మొక్క అందజేస్తున్న కలెక్టర్ వినోద్ కుమార్

ఎస్ఇసిని కలిసిన కలెక్టర్

ప్రజాశక్తి - బాపట్ల

సూర్యలంక హరిత రిసార్ట్‌కు విచ్చేసిన రాష్ట్ర ఎన్నికల కమిషన్ నీలం సాహ్నిని కలెక్టర్ వినోద్ కుమార్ బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఆమెకు మొక్క అందజేశారు.



విద్యార్థినిని అభినందిస్తున్న యాజమాన్యం

రాష్ట్ర పోటీల్లో సత్తా చాటిన విద్యార్థిని

ప్రజాశక్తి - రేపల్లె

బోధి ధర్మ టెక్వాండో అకాడమీకి చెందిన జి తులసి లక్ష్మి (యు 49కెజి) రాష్ట్ర స్థాయి ఎస్జిఎఫ్ టోర్నమెంట్‌లో కాంస్య పతకం సాధించిందని చీఫ్ కోచ్ కె రోహిత్ వర్మ అన్నారు. ఏలూరులో జరిగిన రాష్ట్ర స్థాయి బాల, బాలికల థైక్వాండో ఛాంపియన్‌షిప్ పోటీల్లో కాంస్య పథకం సాధించిందని అన్నారు. బోధిధర్మ థైక్వాండో అకాడమీ తరపున, ఎపి థైక్వాండో సంఘం తరపున మాస్టర్ వి రావును అభినందించారు. భవిష్యత్తు పోటీల్లో మరిన్ని విజయాలు సాధించి రాష్ట్రం, అకాడమీకి మరింత గౌరవం తీసుకురావాలని అన్నారు. కార్యక్రమంలో మాస్టర్ వి రావు, 7వ డాన్, డైరెక్టర్, బోధిధర్మ థైక్వాండో అకాడమీ జనరల్ సెక్రటరీ, ఎపి థైక్వాండో సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న రోటరీ ప్రతినిధులు

మొక్కలు నాటిన రోటరీ ప్రతినిధులు

ప్రజాశక్తి - అద్దంకి

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో పాఠశాల హెచ్ఎం పి గంగాధర్, రోటరీ ప్రెసిడెంట్ బాచిన శివధర పూర్ణచంద్రరావు, సెక్రటరీ అలహరి హరిప్రసాద్ మొక్కలు నాటి ఇంట్రాక్టివ్ క్లబ్ ట్రాక్ పనులను ప్రారంభించారు. పాఠశాల ఆవరణలో రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ చేయాల్సిన పనులు విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీనియర్ రొటీరియన్ చంద్రమౌళి, అంజద్ భాష, పిఈటి శ్రీనివాస్ పాల్గొన్నారు.



చేనేతలకు సరుకులు అందజేస్తున్న నాయకులు

చేనేత కార్మికులకు తుపాను సాయం

ప్రజాశక్తి - భట్టిప్రోలు

మొంత తుఫాన్ కారణంగా నిరాశ్రయులైన చేనేత కార్మికులు, మత్స్యకారులకు ప్రభుత్వం నుండి మంజూరైన బియ్యం, నిత్యవసర సరుకులు బుధవారం అందజేశారు. ఒక్కొక్క కుటుంబానికి 50 కేజీల బియ్యం, లీటరు పామాయిల్, ఉల్లిపాయలు, కందిపప్పు, బంగాళా దుంపలు, పంచదార అందజేశారు. టిడిపి బిసి సెల్ అధ్యక్షులు బట్టు మల్లిఖార్జున రావు, డబ్ల్యుడిసి అధ్యక్షులు యర్రంశెట్టి కర్ణ శ్రీనివాసరావు, జడ్పిటిసి తిరువీధుల ఉదయ భాస్కరి, బాలాజీ, టిడిపి ప్రధాన కార్యదర్శి గొట్టుముక్కల లెనిన్, రేషన్ డీలర్స్ జిల్లా ఉపాధ్యక్షులు కుక్కల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

నైపుణ్యాన్ని వెలికి తీసేందుకే చెకుముకి

ప్రజాశక్తి - చీరాల

జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మండల, పట్టణ స్థాయి చెకుముకి సైన్స్ ప్రతిభా పరీక్ష స్థానిక కెజిఎం బాలికోన్నత పాఠశాల్లో బుధవారం నిర్వహించారు. పట్టణ స్థాయిలో ప్రైవేటు పాఠశాలల విభాగంలో విజ్ఞాన భారతి పాఠశాల మొదటి స్థానాన్ని సాధించగా ప్రభుత్వ పాఠశాలల విభాగంలో ఎన్ఆర్ అండ్ పీఎం హైస్కూల్ విజేతగా నిలిచింది. మండల స్థాయిలో ప్రైవేటు పాఠశాలల విభాగంలో గాంధీనగర్ ఎకె అండ్ కె ఇంగ్లీష్ మీడియం స్కూల్, ప్రభుత్వ పాఠశాలల విభాగంలో ఈపూరుపాలెం జడ్పీ బాలికోన్నత పాఠశాల విద్యార్థులు మొదటి స్థానంలో నిలిచారు. విజేత బృందాలు జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనట్లు



ప్రశ్న పత్రాలు ఆవిష్కరిస్తున్న హెచ్ఎం వెంకటేశ్వరరావు

తెలిపారు. హెచ్ఎం ఎ వెంకటేశ్వరరావు హాజరై చెకుముకి ప్రశ్నా పత్రం విడుదల చేశారు. కార్యక్రమంలో జెవివి నాయకులు బి పిచ్చయ్య, యుటిఎఫ్ నాయకులు కుర్రా శ్రీనివాసరావు, సీనియర్ నాయకులు జి సూరిబాబు, లూకా మాస్టారు పాల్గొన్నారు.

దెబ్బతిన్న పంటలను నమోదు చేయించాలి

ప్రజాశక్తి - వేమూరు

మొంథా తుఫాన్ వల్ల దెబ్బతిన్న పంటలు నమోదు చేయకుండా వ్యవసాయ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, తక్షణమే పంట నమోదు చేయించాలని కౌలు రైతు సంఘం నాయకులు చుండూరు తహశీల్దారు నాగరాజరావుకు వినతి పత్రం అందజేశారు. మండలంలోని వలివేరు కౌలు రైతులు మాట్లాడుతూ తుపాను కారణంగా నోటికాడకు వచ్చిన పంట నేలవాలి దెబ్బ తిన్నప్పటికీ వ్యవసాయ అధికారులు నిర్లక్ష్యంగా కౌలు రైతుల పేర్లను నమోదు చేయడం లేదని ఆగ్రహ వ్యక్తం చేశారు. ఈపాటికే రూ.వేలల్లో వెచ్చించి సాగుచేసిన పంటకు ప్రభుత్వం అందించే పరిహారంతో నైనా వ్యవసాయ పనులు కొనసాగించేందుకు కొంతమేర ఊరట లభిస్తుందని అన్నారు. ఇప్పటికైనా నష్టపోయిన తమ పంటలు పరిశీలించి నమోదు చేయాలని కోరారు. కౌలు రైతులు కౌలు



తహశీల్దారుకు వినతి పత్రం అందజేస్తున్న కౌలు రైతులు

కార్డు, ఆధార్ కార్డు, బ్యాంకు కాతా జతచేసి వ్యక్తిగత అర్జీలు తహశీల్దారుకు అందించి ఎకనాలజిమెంటు తీసుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కౌలు రైతులు పులివర్తి బుల్లియ్య, పులివర్తి ప్రియకుమార్, పులివర్తి సుధీర్, పులివర్తి రవీంద్ర, పండిపాటి రెడ్డియ్య, కొండముది సుశీలరావు, వలివేటి రవి, కొండమూడి భాస్కరరావు, సుద్దపల్లి మోజేష్ పాల్గొన్నారు.

యానాది కాలనీలో పండ్లు పంపిణీ

ప్రజాశక్తి - చీరాల

వైసీపీ ఇంచార్జి కరణం వెంకటేష్ బాబు, గీత దంపతుల పెళ్లిరోజు సందర్భంగా తేళ్ల రాంబాబు ఆధ్వర్యంలో ఈపురుపాలెం కాలువ కట్ట వద్ద వృద్ధులు, పిల్లలకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఇంటెలెచ్యువల్ వైసిపి ఇన్చార్జి తేళ్ళ రాంబాబు మాట్లాడుతూ ప్రజా సేవలో నిరంతరం కృషి చేస్తూ తుఫాను బాధితులకు అండగా పరామర్శిస్తూన్న తమ నాయకులు కరణం వెంకటేష్ బాబు, గీతల వివాహ దినోత్సవం సందర్భంగా పండ్లు పంపిణీ చేయటం



పండ్లు పంపిణీ చేస్తున్న తేళ్ళ రాంబాబు

అనందంగా ఉందని అన్నారు.



ఈ క్రాప్ నమోదు పరిశీలిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

ఈ క్రాప్ నమోదు పరిశీలన

ప్రజాశక్తి - బాపట్ల

ఈ క్రాప్‌లో నమోదైన పంటను క్షేత్ర స్థాయిలో పరిశీలించాలని అధికారులకు కలెక్టర్ వి వినోద్ కుమార్ సూచించారు. మండలంలోని కంకటపాలెంలో ఈ క్రాప్‌లో పంట నమోదైన వ్యవసాయ పైర్లను కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా సర్వే నెంబర్ 2లో ఈ క్రాప్ 5.9 వర్షన్, ఈ పంట యాప్‌లో ఆన్‌లైన్ ద్వారా నమోదు చేసిన మన్నెం నిమ్మికి చెందిన 3.19 ఎకరాల పొలంలో వేసిన వరి పైరు ఆయన పరిశీలించారు. మన్నెం నిమ్మికి ఆయన ఫోన్ చేసి పంట వివరాలు తెలుసుకున్నారు. గ్రామంలో ప్రతి ఇంట్లో మరుగుదొడ్డి ఉండాలని సర్పంచ్‌కి తెలిపారు. గ్రామంలో ఎవరు ఆరుబయట మల విసర్జన చేయకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. గ్రామంలోని రెండు డొంకల్లో రోడ్డు ఏర్పాటు చేయాలని కలెక్టర్‌ను కోరగా ప్రతి ఇంట్లో మరుగుదొడ్డి ఏర్పాట్లకు చర్యలు తీసుకుంటే, రోడ్ల నిర్మాణం చేపడతామని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో ఎఒ శారద, కంకటపాలెం సర్పంచ్ మద్దిరాల వందనం, వీఆర్ఓ సుధారాణి, విఎఎ షబీనా పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి - అద్దంకి

టిడిపి సంస్థాగత ఎన్నికల్లో భాగంగా స్థానిక పోతురాజు గండిలో గల తెలుగుదేశం కార్యాలయంలో పట్టణ కార్యవర్గాన్ని బుధవారం ఎన్నుకున్నారు. పట్టణ అధ్యక్షులు అరిగల నాగరాజు, ఉపాధ్యక్షులు దొప్పలపూడి ప్రసాద్, ప్రధాన కార్యదర్శి యనగండ్ల శ్రీనివాసరావు, కోశాధికారి మామిడి రాంబాబు, కార్యనిర్వాహక కార్యదర్శులు ఇక్కుర్తి శ్రీనివాసరావు, షేక్ మహబూబ్, అద్దంకి ఏడుకొండలు, కార్యదర్శులు కన్నెబోయిన మణికంఠ, పప్పుల శ్రీనివాసరావు, బండారు వెంకటరావు ఎన్నికయ్యారు.

నేడు మంత్రి గొట్టిపాటి పర్యటన

ప్రజాశక్తి - బల్లికురవ

మంత్రి గొట్టిపాటి రవికుమార్ నేడు గురువారం ఉదయం 9 గంటలకు కొప్పెరపాడు నుండి కొత్తూరు మీదుగా జమ్మలమడక వరకు నిర్మించనున్న బిటి రోడ్డుకు శంకుస్థాపన, విద్యార్థులకు ఉచితంగా సైకిల్ పంపిణీ చేయనున్నట్లు టిడిపి అధ్యక్షులు ధూళిపాల హనుమంతరావు తెలిపారు.

తుపాను బాధితులకు సాయం అందించాలి : సిపిఎం

కలెక్టరేట్ వద్ద మహిళల నిరసన

ప్రజాశక్తి- ఒంగోలు సిటీ

మొంథా తుపాను ప్రభావంతో ఒంగోలు నగరంలో నష్టపోయిన ప్రతి కుటుంబానికి ప్రభుత్వం తక్షణమే సాయం అందించాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. బాధితులకు సాయం అందించాలని కోరుతూ సిపిఎం నగర కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద నగరంలోని ముంపు కాలనీలకు చెందిన మహిళలు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం నగర కార్యదర్శి చీకటి శ్రీనివాసరావు మాట్లాడుతూ తుపాను ప్రభావంతో నగరంలోని పోతురాజు కాలువ, నల్లవాగుకు ఇరువైపులా 15 డివిజన్ల పరిధిలో 54 కాలనీలకు చెందిన 60 వేల మంది ముంపునకు గురైనట్లు తెలిపారు. ప్రభుత్వం కేవలం 1,500 కుటుంబాలనే గుర్తించిందన్నారు. ఎన్యూమరేషన్ ప్రక్రియలో తీవ్ర అవకతవకలు జరిగాయని ఆరోపించారు ము.ముంపునకు గురైన పలు కాలనీల్లో సహాయం అందించలేదన్నారు. పునరావాస కేంద్రాల్లో ఉన్నవారికే సాయం పరిమితం చేయడం అన్యాయమని విమర్శించారు. ముంపు కారణంగా ప్రతి కుటుంబం నిత్యావసర వస్తువులు, గహోపకారణాలు, విద్యార్థుల బుక్స్ దెబ్బతిన్నట్లు తెలిపారు. ఒక్కొక్క కుటుంబం సగటున రూ, 10 వేల వరకూ నష్టపోయారని తెలిపారు ఒంగోలు నగరాన్ని అధికారికంగా ముంపు నగరంగా ప్రకటించి, నష్టపోయిన ప్రతి కుటుంబానికి రూ. 10 వేల వంతున ఆర్థిక సాయం అందించాలన్నారు. ప్రతి కుటుంబానికి 50 కిలోలు బియ్యం, నిత్యావసర వస్తువులు అందించాలని డిమాండ్ చేశారు. ఈ విషయం పై జిల్లా అధికారులు స్పందించి నగరం లో ప్రత్యేక టీముల ద్వారా మరోసారి ఎన్యుమరేషన్ చేసి బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ర్యాలీగా కలెక్టర్ కార్యాలయం ఎదుట బైఠాయించారు. సిఐ జోక్యంతో ఆందోళన కారుల తరపున జిల్లా కలెక్టర్ పి. రాజాబాబుకు సిపిఎం నాయకులు చీకటి శ్రీనివాసరావు, ఎం. రమేష్ తదితరులు వినతిపత్రం అందజేసి నగర ప్రజల సమస్యలను పరిష్కరించాలని కోరారు. దీంతో కలెక్టర్ డిఆర్ఒ చినఓబులేసును ఆందోళనకారుల వద్దకు పంపారు. డిఆర్ఒ ఆందోళనకారుల వద్దకు చేరుకొని కలెక్టర్ సూచన మేరకు రీ ఎన్యూమరేషన్ చేయించి ఆర్థిక అర్హులక ఆర్థిక సాయం అందేలా చూస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నగర కార్యదర్శి వర్గ సభ్యులు జి.రమేష్, తంబి శ్రీనివాసులు, నగర కమిటీ సభ్యులు భావనారాయణ, సయ్యద్ హుస్సేన్, జి ఆదిలక్ష్మి, దారా వెంకటేశ్వర్లు, పలు కాలనీల మహిళలు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చీకటి శ్రీనివాసరావు



ఆందోళన కారులకు నచ్చచెబుతున్న డిఆర్ఒ చిన్న ఓ బులేసు



బాధితులకు సాయం అందజేస్తున్న పెద్దిశెట్టి చంద్ర, వరలక్ష్మి

వరద బాధితులకు సాయం

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు, ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధనరావు ఆదేశాల మేరకు 29వ డివిజన్‌లోని వరద బాధితులకు ప్రభుత్వం నుంచి వచ్చిన సాయాన్ని బుధవారం అందజేశారు. మొంథా తుపాన్ కారణంగా కురిసిన భారీ వర్షాలకు 29వ డివిజన్‌లోని ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించారు. భారీ వర్షాలకు మిండాల ఎల్లమ్మ, మిండాల వెంకట సుశీల, బంగారు శ్రీలక్ష్మి కి నష్టం కలిగింది.వారికి ఒక్కొక్క కుటుంబానికి రూ.3 వేలు నగదు, నిత్యావసర వస్తువులైన 24 కిలోల బియ్యం, కిలో పంచదార, కిలో కందిపప్పు, లీటర్ వంట నూనె, కిలో ఉల్లిపాయలు, కిలో బంగాళాదుంపలు 29 వ డివిజన్ అధ్యక్షులు పెద్దిశెట్టి చంద్ర ఒంగోలు నగర తెలుగు మహిళా అధ్యక్షురాలు పెద్దిశెట్టి వరలక్ష్మి అందజేశారు. ఈ కార్యక్రమంలో సచివాలయ ప్లానింగ్ సెక్రటరీలు, అడ్మిన్లు, వెల్ఫేర్ సెక్రటరీలు, రేషన్ షాప్ డీలర్ గుంజి విజయలక్ష్మి పాల్గొన్నారు.



నియామకపత్రం అందుకుంటున్న నారాయణ

సఫాయి మజ్దూర్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడిగా నారాయణ

ప్రజాశక్తి - ఒంగోలు సిటీ

అఖిల భారతీయ సఫాయి మజ్దూర్ కాంగ్రెస్ ట్రేడ్ యూనియన్ ప్రకాశం జిల్లా అధ్యక్షుడిగా ఒంగోలు పట్టణానికి చెందిన పొగడ్త నారాయణ నియమితులయ్యారు. స్థానిక యూనియన్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ గద్దె త్యాగరాజు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా త్యాగరాజు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా సఫాయి మజ్దూర్ యూనియన్ కార్మికుల హక్కుల కోసం నిరంతరం పోరాడుతున్నట్లు తెలిపారు.. ఈ కార్యక్ర మంలో రాష్ట్ర మాదిగ సంక్షేమ పోరాట సమితి అధ్యక్షుడు కొమ్ము సుజన్ మాదిగ,విజయ్ కుమార్,అప్పారావు, ఆదాము, సుబ్బారావు పాల్గొన్నారు.

లబ్ధిదారుల ఎంపికకు అనుమతి

ప్రజాశక్తి - ఒంగోలు

గ్రామీణ ప్రాంతాల్లో ఇళ్లు లేని పేదలకు ప్రధాన మంత్రి ఆవాస్ యోజన (గ్రామీణ) పథకం కింద లబ్ధిదారుల ఎంపికకు కేంద్ర ప్రభుత్వం అనుమతిచ్చినట్లు హౌసింగ్ కార్పొరేషన్ ప్రాజెక్టు డైరెక్టర్ పెరుగు ప్రసాద్ బుధవారం మీడియాకు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇళ్ల లేని పేదలను గుర్తించేందుకు గహనిర్మాణ శాఖ ఆధ్వర్యంలో కేంద్రం సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తొలుత నవంబర్ 5 వరకూ గడువు నిర్ణయించినట్లు తెలిపారు. సాంకేతిక సమస్యలు , జాబ్ కార్డు, రేషన్ కార్డు వివరాలు సరిపోకపోవడం లాంటి కారణాల వల్ల సర్వే గడువును ఈనెల 30 వరకూ పొడిగించినట్లు ఆయన పేర్కొన్నారు. ప్రకాశం జిల్లాలో పనిచేస్తున్న సచివాలయ సిబ్బంది, గహనిర్మాణ శాఖ సిబ్బంది ఇంటింటి సర్వేను వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ పి రాజా బాబు ఆదేశించినట్లు తెలిపారు. గ్రామీణ పేద కుటుంబాలు తమ జాబ్ కార్డు, రేషన్ కార్డు, ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతా జెరాక్స్ కాపీలు సిద్ధం చేసుకుని, తమ సచివాలయ పరిధిలోని ఇంజినీరింగ్ అసిస్టెంట్ లేదా సంబంధిత అసిస్టెంట్ ఇంజనీర్ ను సంప్రదించాలన్నారు. గ్రామీణ పేదల ఇంటి కల నెరవేర్చేందుకు ఈ సర్వే కీలకమని తెలిపారు.

10 నుంచి సమ్మేటివ్ అసెస్మెంట్-1 పరీక్షలు

ప్రజాశక్తి- ఒంగోలు సిటీ

ఈనెల 10 నుంచి 19 వరకూ సమ్మేటివ్ అసెస్మెంట్-1 పరీక్షలు నిర్వహిస్తున్నట్లు డిఇ కిరణ్ కుమార్, డిసిఇబి సెక్రటరీ శ్రీనివాసరావు బధవారం తెలిపారు. పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు అకడమిక్ క్యాలెండర్ ప్రకారం జూన్ నుంచి అక్టోబర్ వరకూ బోధించిన పాఠ్యాంశాల ఆధారంగానే పరీక్షలు నిర్వస్తున్నట్లు తెలిపారు. తరగతి వారీగా పరీక్షల షెడ్యూల్, మార్కుల విధానం, సిలబస్ వివరాలను అన్ని మండలాలకు పంపినట్లు పేర్కొన్నారు. 1వ తరగతి నుంచి 5వరకూ ఈనెల 11 నుంచి 15 వరకూ ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. ఈనెల 11న ఫస్ట్ లాంగ్వేజ్, 12న ఇంగ్లీష్, 13న గణితం,14న పర్యావరణ విజ్ఞానం, 15న ఒఎస్ఎస్‌సి పరీక్ష నిర్వహిస్తారని తెలిపారు. 6వ తరగతి నంచి 10 తరగతి వరకూ ఈనెల 10 నుంచి 19 వరకూ పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. ఉదయం 9.15 గంటల నంచి మధ్యాహ్నం 12.30 వరకూ 8 నుంచి 10 తరగతులు, మధ్యాహ్నం 1.15 గంటల నుంచి సాయంత్రం 4.15 వరకు 6,7తరగతులకు పరీక్షలు జరుగుతాయి. ఈనెల 10న ఫస్ట్ లాంగ్వేజ్ 11న సెకండ్ లాంగ్వేజ్,12న థర్డ్ లాంగ్వేజ్,13న గణితం, 14న సైన్స్ / ఫిజికల్ సైన్స్,17న బయోలాజికల్ సైన్స్ మరియు సామాజిక శాస్త్రం,18న మొదటి భాష కాంపోజిట్ కోర్స్ (సంస్కృతం, హిందీ, అరబిక్, పర్షియన్) మరియు ఒఎస్ఎస్‌సి పేపర్-1, 19న ఒఎస్ఎస్‌సి పేపర్-2 పరీక్షలు జరుగుతాయి. 1 నుంచి 5 తరగతి ప్రశ్నాపత్రాలు క్లస్టర్ కాంప్లెక్స్ వద్ద, 6 నుంచి 10 తరగతి ప్రశ్నాపత్రాలు మండల రిసోర్స్ సెంటర్ వద్ద భద్రపరచాలన్నారు. ప్రతి మండలంలో ముగ్గురు సభ్యులతో కూడిన కమిటీ ఏర్పాటు చేసి ప్రశ్నాపత్రాల భద్రత, పరీక్షల నిర్వహణ బాధ్యతలు అప్పగించాలని ఎంఇఒలకు సూచించారు

బ్యూటీ పార్లర్ కోర్సులో ఉచిత శిక్షణ

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని గ్రామీణ ప్రాంత మహిళలకు బ్యూటీ పార్లర్ కోర్సులో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు రూడ్ సెట్ సంస్థ డైరెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 25 నుంచి డిసెంబర్ 29 వరకూ 35 రోజుల పాటు శిక్షణ ఇస్తామన్నారు. 19 ఏళ్ల నుంచి 50 ఏళ్ల లోపు మహిళలు తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. శిక్షణ కాలంలో ఉచిత భోజన వసతి, సదు పాయాలు ఉంటాయని తెలిపారు. ఆసక్తి కలిగిన వారు 9573363141 మొబైల్ నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

ఎల్ఐసి ఎఒఐ సౌత్ సెంట్రల్ జోన్

మహాసభను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి - ఒంగోలు సిటీ

ఖమ్మంలో ఈ నెల 8,9 తేదీల్లో నిర్వహిస్తున్న ఎల్ఐసి ఎఒఐ సౌత్ సెంట్రల్ జోన్ మహాసభను జయప్రదం చేయాలని యూనియన్ నెల్లూరు డివిజన్ ప్రధాన కార్యదర్శి బి.వెంకట్రావు తెలిపారు. స్థానిక ఎల్ఐసి కార్యాలయం వద్ద మహాసభకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వెంకట్రావు మాట్లాడుతూ ఏజెంట్ల సమస్యల పరిష్కారం కోసం ఎల్ఐసి ఎజెంట్స్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా (ఎల్ఐసి ఎఒఐ) నిరంతర పోరాడుతున్నట్లు తెలిపారు. సేవ్ ఎల్ఐసి- ప్రొటెక్ట్ ఏజెంట్స్ అనే నినాదంతో ఏర్పడిన సంఘం ఎల్ఐసి ఏజెంట్ల హక్కుల కోసం రాజీ లేని పోరాటం చేస్తోందన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న విధానాలు ఎల్ఐసి స్థిరత్వానికే కాకుండా ఏజెంట్లు, పాలసీదారుల ప్రయోజనాలపైనా ప్రభావం చూపుతున్నాయన్నారు.ప్రస్తుత పరిస్థితుల్లో ఎల్ఐసి పబ్లిక్ సెక్టార్ సంస్థగా నిలవాలంటే, కేంద్ర ప్రభుత్వం ప్రైవేటీకరణ దిశగా తీసుకుంటున్న చర్యలను అడ్డుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఖమ్మం జోనల్ మహాసభల్లో ఈ దిశగా భవిష్యత్ కార్యాచరణ రూపుదిద్దుకుంటుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎల్ఐసి ఎఒఐ ఒంగోలు బ్రాంచి నాయకులు కె.వెంకటేశ్వర్లు, పి.ఆంజనేయులు, సిహెచ్.అమర్‌నాథ్, బి.సుబ్బారావు, ఎ.రామాంజనేయులు, డి.శ్రీనివాసరావు, బి.అంజయ్య, వై.వెంకట్రావు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎల్ఐసి ఎఒఐ నాయకులు

కలెక్టరేట్‌ను సుందరంగా తీర్చిదిద్దాలి

బాపట్ల జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్

ప్రజాశక్తి - బాపట్ల

కలెక్టరేట్‌ను మరింత సుందరంగా తీర్చి దిద్దాలని జిల్లాకలెక్టర్ వి. వినోద్ కుమార్ తెలిపారు. కలెక్టరేట్‌లో నిర్వహిస్తున్న మరమ్మతు పనులను బుధవారం పరిశీలించారు. తొలుత కలెక్టర్ కార్యాలయం ప్రాంగణంలో పర్యటించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కలెక్టరేట్ ప్రాంగణంలోని ప్రతి విద్యుత్ స్తంభానికి విద్యుత్ దీపం ఏర్పాటు చేయాలని మున్సిపల్ డిఇని కలెక్టర్ ఆదేశించారు. డిఎంఎఫ్ నిధులతో చేపట్టిన కలెక్టర్ కార్యాలయ భవనం మరమ్మతుల పనులను పరిశీలించారు. వర్షాకాలంలో భవనం కురుస్తునందున స్లాబ్ కి పైభాగంలో కాంక్రీట్ తో ప్లాస్టింగ్ చేయాలని సూచించారు. దస్త్రాలను నిల్వ చేయడానికి ప్రత్యేక గది లేకపోవడంతో ఎదుర్కొంటున్న ఇబ్బందులను కలెక్టరేట్ ఎఒ మల్లికార్జునరావు కలెక్టరు దష్టికి తెచ్చారు. భవనంపై భాగంలో రికార్డుల రూము నిర్మించాలని ఆర్అండ్‌బి డిఇ, కలెక్టరేట్ ఏవోలకు తెలిపారు. కార్యాలయం భవనానికి అన్ని వైపులా విద్యుత్ దీపాలు ఉండాలన్నారు. కలెక్టర్ కార్యాలయం ఆవరణంలో రాత్రివేళ చీకటి లేకుండా విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలన్నారు. మిగిలిపోయిన రహదారి నిర్మాణం, మరమ్మతు పనులను నాణ్యతతో చేపట్టాలన్నారు. కలెక్టర్ కార్యాలయానికి వచ్చే ముందు వైపు ఉన్న ఫ్లైఓవర్ కు ఇరువైపులా విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలన్నారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కలెక్టర్ వెంట డిఆర్ఒ జి.గంగాధర్ గౌడ్, మున్సిపల్ డిఇ కష్ణారెడ్డి, ఆర్అండ్‌బి ఇంజినీరింగ్ అధికారులు ఉన్నారు.



కలెక్టరేట్ ప్రాంగణంలో పరిశీలిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్



స్థలాన్ని పరిశీలిస్తున్న అనగాని శివప్రసాద్

ఎఎంసి కోసం స్థల పరిశీలన

ప్రజాశక్తి - నిజం పట్నం

మండలంలోని పల్లపట్ల పంచాయతీలో ఒకప్పటి సమితి కార్యాలయాల భవనాల ను టిడిపి సీనియర్ నాయకులు అనగానే శివప్రసాద్, అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా శివప్రసాద్ మాట్లాడుతూ ఏళ్ళ తరబడి సమితి కార్యాలయ భవనాలు ఖాళీగా ఉండటంతో శిధిల వ్యవస్థకు చేరాయని, వాటిని మంత్రి అనగాని సత్యప్రసాద్ ఆదేశాల మేరకు అధికారులతో చర్చించి కూచినపూడి ఎఎంసి యార్డుకు ఎటువంటి భవనాలు లేకపోవడంతో ఎఎంసి చైర్మన్ వెంకట యాదవ్ విన్నపం మేరకు జెడ్పి అధికారులతో చర్చించి ఈ స్థలాన్ని ఎఎంసికి లీజు రూపంలో ట్రాన్స్‌ఫర్ చేయించి ఈ ప్రాంత ప్రజలకు రైతులకు అన్ని విధాల ఆదుకుంటూ ఉపాధి హామీ కల్పించేందుకు మార్కెట్ యార్డు ఇక్కడ ఏర్పాటుకు పరిశీలిస్తున్నట్లు తెలిపారు. పల్లపట్లలో మార్కెట్ యార్డు ఏర్పాటు చేయటంతో 3మండలాల ప్రజలకు అందుబాటులో ఉంటుందని అన్నారు. ఎటువంటి స్టోరేజీ లేకపోవడంతో రైతులు కల్లాల్లోనే తక్కువ రేటుకు తమ ధాన్యం, వేరు శనగ అమ్ముకోవాల్సి వస్తుందని అన్నారు. మార్కెట్ యార్డ్ ద్వారా గోడౌన్ ఏర్పాటు చేస్తే చుట్టుపక్క గ్రామాల ప్రజలకు ఉపాధితో పాటు రైతులకు తమ పంట నిల్వ చేసుకుని గిట్టుబాటు ధరకు అమ్ముకుంటుందని, ఎక్కువ అవకాశాలు ఉంటాయని అన్నారు. కార్యక్రమంలో కూచినపూడి ఎఎంసి చైర్మన్ ఓగిబోయిన వెంకట్ యాదవ్, తాతా ఏడుకొండలు, కొలసాని రాము, బొర్రా సురేంద్ర, కేసన రామకృష్ణ, శొంఠి శ్రీనివాసరావు, పిన్నిబోయిన చింతారావు పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న గౌడ సంఘం నాయకులు

కృష్ణ ప్రసాద్ క్షమాపణ చెప్పాలి

ప్రజాశక్తి - భట్టిప్రోలు

'మీ తాతలు కళ్ళు గీసుకుని బతుకుతారని' వైసిపి మాజీ మంత్రి జోగి రమేష్‌పై కూటమి ప్రభుత్వ ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ చేసిన అనుచిత వ్యాఖ్యలు ఖండిస్తూ గౌడ సామాజిక వర్గం నిరసన చేపట్టారు. తొలుత భట్టిప్రోలు రైలు గేటు వద్దనున్న వైఎస్ఆర్ విగ్రహానికి వైసీపీ మండల కన్వీనర్ పడమట శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పూల మాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా శ్రీనివాస రావు మాట్లాడుతూ గౌడ కులాన్ని కించపర్చేలా వసంత కృష్ణప్రసాద్ వ్యాఖ్యలు దుర్మార్గమని అన్నారు. వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కృష్ణ ప్రసాద్‌పై వెంటనే చర్యలు తీసుకోవాలని స్థానిక పోలీసు స్టేషనులో ఎస్ఐ శివయ్యకు ఫిర్యాదు చేశారు. కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలు బాగా గమనిస్తున్నారని, రానున్న రోజుల్లో ప్రజలే మీకు బుద్ధి చెబుతారని అన్నారు.

కార్తీక పౌర్ణమి పూజలు

ప్రజాశక్తి - అద్దంకి

మండలంలో కొలువైన సింగరకొండ ప్రసన్నాంజనేయ స్వామి దేవస్థానంలో కార్తీక పౌర్ణమి సందర్భంగా స్వామి వారికి పూజ ఘనంగా నిర్వహించారు. తెనాలి మండలం కొల్లూరుకు చెందిన సమ్మెట వెంకట సాయి శ్రీహర్ష విమలాదేవి దంపతులు ఆలయంలో గుడి చుట్టూ మేళ తాళాలతో ప్రదక్షణ చేశారు. అధిక సంఖ్యలో భక్తులు దేవస్థానంచుట్టూ దీపాలు వెలిగించి కార్తీక పౌర్ణమి మాస పూజలు చేశారు. పూజ అనంతరం భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు తీసుకున్నారు. దాతలకు అన్నదాన సత్రంలో భోజనం ఏర్పాటు చేశారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్, పాలక మండలి అధ్యక్షులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం అక్రమ తరలింపు

- పగలు పెట్రోల్ బంకులో నిలపడం
- నంబర్‌ప్లేట్లు లేని వాహనాలు
- పట్టించుకోని విజిలెన్స్ అధికారులు

ప్రజాశక్తి - భట్టిప్రోలు

ప్రభుత్వాలు మారిన రేషన్ మాఫియా విధానాలు మాత్రం మార్పు చెందటం లేదు. గత వైసిపి పాలనలో విచ్చలవిడిగా సాగిన రేషన్ మాఫియా ఆగడాలు ప్రభుత్వం మారడంతో మరింతగా పెచ్చరిల్లాయి. గతంలో విజిలెన్స్ అధికారులు దాడులు చేసి అక్రమ రేషన్ బియ్యం నిల్వలను స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేశారు. ఏడాదిన్నర కాలంగా ఎలాంటి దాడులు లేకపోగా బియ్యం అక్రమ దందా విస్తృత పరిచారు. ఈ బియ్యం తరలింపుకు ప్రత్యేకంగా నంబరు ప్లేట్లు లేని కొన్ని వాహనాలు సిద్ధం చేసుకుని వాటిని నెల ప్రారంభం నుండి నెల మధ్య వరకు రాత్రివేళలో బయటకు తీసి రేషన్ తరలింపుకు వినియోగిస్తూ ఉంటారు. పగలు పెట్రోల్ బంకులో ఒక పక్కన నిల్వచేసి ఎవరికి ఏమి తెలియనట్లుగా వ్యవహరిస్తూ ఉంటారు. గతంలో గ్రామానికి చెందిన దీపాల శ్రీనివాసరావు, అతని సోదరుడు నాగమల్లేశ్వరరావులపై విజిలెన్స్ అధికారులు దాడులు జరిపి అక్రమ నిల్వలను పట్టుకొని కేసులు బనాయించారు. రేషన్ అక్రమ తరలింపు వ్యవహారం అధికారుల తోపాటు స్థానిక ప్రజా ప్రతినిధులు, నాయకులకు తెలియని విషయమేమీ కాదని ప్రజలు వ్యాఖ్యానిస్తున్నారు. ప్రజాప్రతినిధులకు ప్రతినెల మండలాలకి రూ.లక్ష చొప్పున అప్పజెప్పే విధంగా ఒప్పందం కుదిరినట్లు ప్రచారం.

ఉచిత బియ్యం అక్రమార్కులకు వరం

ప్రభుత్వం విపత్తుల సమయంలో ప్రజలకు ఉచితంగా అందించే రేషన్ బియ్యం అక్రమార్కులకు వరంగా మారుతుంది. రేషన్ బియ్యాన్ని అనేక చోట్ల తినటానికి వినియోగించే పరిస్థితి లేదు. రేషన్ బియ్యాన్ని కేజీ రూ.10 నుండి రూ.12 వరకు అక్రమార్కులకు అప్పగిస్తూ రూ.15 నుండి రూ.20 చొప్పున బయటకు తరలిస్తున్నట్లు సమాచారం. రేషన్ మాఫియా ద్వారా ఇరువురు అన్నదమ్ములు రూ.కోట్లకు పడగలెత్తారంటే అతిశయోక్తి కాదు. ఒకరు రేషన్ ద్వారా వచ్చిన సొమ్ముతో భూములు కొనుగోలు చేస్తుంటే మరొకరు బంగారం, భవనాలపై పెట్టుబడి పెడుతున్నారనే ప్రచారం ఉంది.



నంబర్ ప్లేట్లు లేని మూడు వాహనాలు

నంబర్ ప్లేట్లు లేని వాహనాలపై చర్యలేవి?

కొన్నేళ్లుగా భట్టిప్రోలులో నంబర్ ప్లేట్లు లేని వాహనాలు రేషన్ బియ్యం అక్రమ తరలింపుకు వినియోగిస్తున్నప్పటికీ వాటిపై ఆర్టీఏ అధికారులు చర్యలు తీసుకున్నట్లుఎక్కడ కనిపించడం లేదు. భట్టిప్రోలు పెట్రోల్ బంకులో, రేపల్లె వెళ్ళే రహదారి ప్రక్కనే ఈ నెంబర్ ప్లేట్లు లేని వాహనాలు నిలిపి కనిపిస్తూ ఉంటాయి.

పారిశుధ్య కార్మికులకు దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి - భట్టిప్రోలు

విశ్రాంత ఉపాధ్యాయులు బొలిశెట్టి శ్రీనివాసరావు తన పుట్టిన రోజు సందర్భంగా పంచాయతీ కార్మికులకు దుప్పట్లు పంపిణి చేశారు. పంచాయతీ పారిశుధ్య కార్మికులు చేస్తున్న పనుల దృష్ట్యా దుప్పట్లు అందించాలనే దృక్పథం తనకు కలిగిందని అన్నారు. నిర్మల దేవి, శివరామప్రసాద్, శెనగపల్లి శ్రీనివాసరావు, ఎం అయ్యప్ప, ఎం గోవిందరాజులు, జిలాని పాల్గొన్నారు.

కారంచేడు : మండలంలోని రంగప్ప నాయుడువారి పాలెం టిడిపి నాయకులు అమరనేని సుబ్బారావు ఇటీవల వచ్చిన తుఫాన్ నేపథ్యంలో రంగప్ప నాయుడు వారిపాలెం, నందిగుంట పాలెంలో పనులు కోల్పోయి ఇబ్బంది పడుతున్న 140 మంది పేదలకు బియ్యం, కూరగాయలు పంపిణీ చేశారు. ఆయన వెంట విఆర్ఒలు శివశంకరరావు, కోటేశ్వరరావు ఉన్నారు.



దుప్పట్లు అందజేస్తున్న బొలిశెట్టి శ్రీనివాసరావు

అగ్రిమెంట్‌తో పొగాకు సాగు చేయాలి

ప్రజాశక్తి-పెద్దారవీడు

రబీ సీజన్‌లో సాగు చేయాలనుకున్న పొగాకు రైతులు పొగాకు కంపెనీలతో అగ్రిమెంటు కుదిరిన తరువాత మాత్రమే పంటను సాగు చేయాలని మండల వ్యవసాయ అధికారి ఎన్ లక్ష్మీనారాయణ సూచించారు. మండలంలోని బి చెర్లోపల్లి గ్రామంలో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమంలో పలు రకాల పంటలను బుధవారం పరిశీలించారు. అగ్రిమెంట్ లేకపోతే కొనుగోలు కూడా కష్టంగా ఉంటుందన్నారు. పొగాకు కొనుగోలు చేయని పక్షంలో రైతు నష్టపోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ రబి సీజన్‌లో వేయబోయే విత్తన మొక్కజొన్న పంటకు కూడా ఆయా కంపెనీల ఒప్పంద పత్రాలు పొందాలన్నారు. మొంథా తుపాను కారణంగా నష్టపోయిన పంటల నష్టాల వివరాలు రైతు సేవా కేంద్రాల్లో ప్రదర్శించినట్లు చెప్పారు. తప్పులు దొర్లినా, అర్హుల పేర్లు లేకపోతే సరిచూసుకోవాలని కోరారు. కంది పంట అక్కడక్కడా మొగ్గ దశకు వస్తుందని, మారుకా మచ్చల పురుగు రాకుండా ఎకరాకు 500 మి.లీ, క్లోరోపైరిఫాస్ 500 ఎంఎల్, వేపనూనెలను కలిపి ముందు జాగ్రత్త చర్యగా పిచికారీ చేసుకోవాలని సూచించారు. మిరపలో నల్ల తామర పురుగులు రాకుండా ఎకరాకు 20 చొప్పున నీలం రంగు జిగురు అటలను పైరుకు ఒక అడుగు ఎత్తులో పెట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి వి సౌజన్య, గ్రామ వ్యవసాయ సహాయకులు శ్రీకాంత్ రైతులు పాల్గొన్నారు.

గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది'

ప్రజాశక్తి - యద్దనపూడి

మండలంలోని సూరవరపుపల్లి, అనంతవరం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఒ కుమారి పత్తి పంట పరిశీలించి రైతులకు సూచనలు చేశారు. ఎఇఒ మధుప్రియ, విఎఎ, రైతులు ఆదియ్య, నరసింహారావు, వాసు, వేణుబాబు, హనుమంతరావు, సుబ్బారావు, శ్రీను, వెంకటరావు పాల్గొన్నారు.

అద్దంకి : మొక్కజొన్నలో సస్య రక్షణ చర్యలు చేపట్టాలని ఎఒ కొర్రపాటి వెంకటకృష్ణ తెలిపారు. మండలంలోని కలవకూరు, సింగరకొండపాలెం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో విఎఎ సీత, ప్రత్యూష, ఎఎంసి డైరెక్టర్ చింతా వెంకటేశ్వరరెడ్డి, ఆత్మ బ్లాక్ టెక్నాలజీ మేనేజర్ శేషారావు పాల్గొన్నారు.

బల్లికురవ : పత్తి పంటలో సూక్ష్మధాతు లోపాల నివారణకు సస్య రక్షణ చర్యలు చేపట్టాలని ఎఒ శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని వేమవరంలో పోలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. కొన్ని ప్రాంతాల్లో పత్తి ఆకులు కుంకుమ రంగులోకి మారి పొలం ఎర్రగా కనిపిస్తోందని అన్నారుకార్యక్రమంలో , ఎఇఒ మౌలాలి, విఎఎ శ్రీకాంత్ నాయక్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న హోమియో వైద్యుడు చంద్రశేఖర్

మానసిక ఒత్తిడి తగ్గించుకోవాలి

ప్రజాశక్తి - పర్చూరు

జాతీయ ఒత్తిడి అవగాహన దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ హెూమియో డాక్టర్ దాసరి చంద్రశేఖర్ మండలంలోని ఉప్పుటూరు పంచాయితీలో బుధవారం అవగాహన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనిషి రోజూ అనేక రకాల సవాళ్లను ఎదుర్కోవలసి ఉంటుందని అన్నారు. ఈ క్రమంలో కొందరు అనేక రకాల ఒత్తిళ్ళకు గురౌతారని అన్నారు. ఈ ఒత్తిళ్ల కారణంగా మనిషికి మానసికంగా, శారీరకంగా అనేక రకాల రుగ్మతలు వస్తాయని తెలిపారు. తాజా సర్వేల ప్రకారం షుగర్, బీపీ, థైరాయిడ్, ఊబకాయం, గుండె, కిడ్నీల వంటి పలు రకాల ఆరోగ్య సమస్యలు దీర్ఘకాల ఒత్తిళ్ల వల్లే వస్తున్నాయని తెలిపారు. కావున ఈ ఒత్తిళ్లను ఎదుర్కోవాలంటే కచ్చితంగా రోజూ ధ్యానం, వ్యాయామం, వాకింగ్, పాజిటివ్ దృక్పథం, స్నేహ పూర్వక వాతావరణం ఎంతగానో అవసరమని అన్నారు. కార్యక్రమంలో వైద్య ఆరోగ్య సిబ్బంది, ఉప్పుటూరు జడ్పీ హైస్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు.



పశువుల దాణా పంపిణీ చేస్తున్న అధికారులు

ఉచిత మెగా పశు వైద్య శిబిరం

ప్రజాశక్తి - నిజాంపట్నం

మండలంలోని దిండి గ్రామంలో శ్రీ సత్య సాయి బాబా ట్రస్ట్ ఆధ్వర్యంలో బుధవారం ఉచిత మెగా పశు వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరానికి విశ్రాంత పశు వైద్య అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ పున్నయ్య శాస్త్రి అవసరమైన మందులు ఉచితంగా అందించారు. శిబిరంలో కూచినపూడి పశువైద్యాధికారి డాక్టర్ ఎం హేమప్రియ పాల్గొన్నారు. 100 పశువులు, 300 గొర్రెలు, 200 కోళ్లకు వివిధ రకాల వైద్య సేవలు అందించారు. పాడి రైతులకు పశువుల పెంపకంలో మెళుకువలు, సూచనలు చేశారు. అనంతరం మొంథా తుఫాన్ ప్రభావిత ప్రాంతాల పాడి రైతులకు ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న పశువుల దాణా పాడి రైతులకు పంపిణీ చేశారు.



మాట్లాడుతున్న ఎంపిడిఒ వరూధిని

గ్రామాల అభివృద్ధిపై దృష్టిపెట్టాలి

ప్రజాశక్తి - అద్దంకి

స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో సాధారణ సర్వసభ్య సమావేశం ఎంపీపీ అవిశ్న జ్యోతి అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ఎంపిడిఒ వరూధిని మాట్లాడుతూ అజెండాలోని 19 అంశాలపై చర్చించారు. మండలంలోని అనేక గ్రామాల్లో అనేక సమస్యలు ఉన్నప్పటికీ క్షేత్రస్థాయిలో సర్పంచులు అభివృద్ధి పనులపై అధికారులు ప్రశ్నిస్తున్నప్పటికీ అవి పరిష్కారం కాకపోవడంతో సమావేశాలకు సర్పంచులు హాజరు కాకపోవడం గర్హనీయం. సమావేశంలో వివిధ శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరు కావాల్సి ఉండగా తూతూ మంత్రంగానే అధికారులు హాజరవుతారు. కొన్ని శాఖల అధికారులైతే క్రింది స్థాయి అధికారులను సమావేశానికి పంపించారు. గ్రామాల నుండి వివిధ సమస్యల పరిష్కారం కోసం కార్యాలయానికి వస్తే సమాచారం కూడా అందించలేని పరిస్థితిలో కార్యాలయం సిబ్బంది పనిచేస్తుందని సభ్యులు ఆరోపించారు. అధికారులు సమన్వయంతో పనిచేయాలని కోరారు.



తీరంలో పర్యటిస్తున్న మహేంద్ర నాథ్

తీరంలో ప్రమాదాల నివారణకు చర్యలు

ప్రజాశక్తి - చీరాల

తుఫాన్ ప్రభావంతో సముద్ర తీర ప్రాంత రహదారి తీవ్రంగా దెబ్బతిని కోతకు గురైందని, సముద్ర స్నానాలు కూడా నిషేధించిన నేపథ్యంలో తెలుగుదేశం అధికార ప్రతినిధి మద్దులూరి మహేంద్రనాథ్ తీర ప్రాంతాన్ని బుధవారం సందర్శించారు. అక్కడి పరిస్థితులను పరిశీలించారు. తుఫాన్ తాకిడికి సముద్రం ఒడ్డు లోతుగా ముందుకు వచ్చి తీరప్రాంతం దెబ్బతిన్నట్లు పేర్కొన్నారు. కొన్నిచోట్ల ఇళ్లు, మత్స్యకారుల పడవ నిల్వ ప్రదేశాలు, రహదారులు ప్రమాదకర స్థితిలో ఉన్నాయని తెలిపారు. భద్రతా చర్యల దృష్ట్యా కార్తీక మాస స్నానాలకు అనుమతి ఇవ్వడం లేదని చెప్పారు. భక్తులు, పర్యాటకులు, స్థానిక ప్రజలు జాగ్రత్తగా వ్యవహరించి సముద్ర తీర ప్రాంతాలకు వెళ్లకూడదని విజ్ఞప్తి చేశారు. ఆయన వెంట ఈపురుపాలెం ఎస్ఐ చంద్రశేఖర్ ఉన్నారు.



డిజిటల్ అసిస్టెంట్‌ను సన్మానిస్తున్న సహోద్యోగులు

డిజిటల్ అసిస్టెంట్‌కు ఉద్యోగోన్నతి

ప్రజాశక్తి - భట్టిప్రోలు

మండలంలోని పల్లికోన సచివాలయంలో డిజిటల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఉయ్యూరు నాగలక్ష్మికి పదోన్నతి లభించింది. కార్యదర్శిగా నిజాంపట్నం మండలంకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా పల్లికోన సచివాలయంలో ఆమెను అభినందిస్తూ ఎంపీటీసీ దున్న తిరుపతి బాబు, మాజీ సర్పంచ్ రాయన ప్రసాదు, మండవ రామకోటయ్య, బూత్ కన్వీనర్ రావూరి నవీన్, పురమ నాగరాజు, టిడిపి అధ్యక్షులు రావూరు వరప్రసాద్, సొసైటీ డైరెక్టర్ సోమశేఖర్ రావు, పంచాయతీ సెక్రెటరీ విజయ్ మణి బాబు, వెల్ఫేర్ అసిస్టెంట్ వాగోలు సురేష్, గ్రామ సర్వేయర్ రవికుమార్ ఆమెను శాలువాలతో సత్కరించారు.

నీరు నిలవకుండా చర్యలు చేపట్టాలి

ప్రజాశక్తి - పర్చూరు

వరద సమయంలో కాలువల్లో నీరు నిలవకుండా చర్యలు చేపట్టాలని స్థానిక టిడిపి నాయకులు అధికారులకు సూచించారు. హైవే రోడ్డు డిఈ మల్లికార్జునరావు, ఎఇ ఖాదర్ నవాజ్ స్థానిక నాయకులతో కలిసి పిడుగురాళ్ల, వాడరేవు జాతీయ రహదారిపై అన్నంభొట్ల వారిపాలెం నుండి ఉప్పుటూరు వరకు నిర్మించిన వంతెనలు, కాలువలను పరిశీలించారు. ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ఆదేశాల మేరకు జాతీయ రహదారిపై ఉప్పుటూరు వద్ద వరద నీరు పోవడానికి తీసిన గండ్లను పరిశీలించారు. అన్నం బోట్లవారి పాలెం వద్ద సైడ్ కాలువ, తొండి వాగు పరిశీలించారు. అక్కడ నీరు నిలవకుండా ఉండేందుకు చర్యల గురించి నివేదిక తయారు చేస్తామని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఏపీ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ షంషుద్దీన్, నాయకులు మానం సాంబశివరావు, కే సురేష్, జి రామకృష్ణ పాల్గొన్నారు.

గిరి ప్రదక్షిణలో భక్తులు

ప్రజాశక్తి - అద్దంకి

మండలంలోని సింగరకొండపై వేంచేసి ఉన్న శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవ స్థానంలో కార్తీక పౌర్ణమి సందర్భంగా స్వామి గిరి ప్రదక్షణ అనంతరం దామోదర స్వామి పూజా నిర్వహించారు. కార్యక్రమంలో ఇఒ మద్దినేని శ్రీనివాసరావు, శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్మన్ గుంజి శ్రీనివాసరావు దంపతులు, శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి వారి ధర్మకర్తల మండలి చైర్మన్ చుండూరి మురళి సుధాకరరావు, గిరి ప్రదక్షిణ ప్రచారకర్త కర్రి రమాసుందరి పాల్గొన్నారు.

పనులు లేక.. పూట గడవక..

- అవస్థలు పడుతున్న చేనేతలు
- అధిక వర్షాలకు మగ్గం గుంటల్లో నీటి ఊట
- నెమ్ముకుంటున్న పడుగులు
- పదిరోజులుగా నిలిచిన పనులు
- ప్రభుత్వం ఆదుకోవాలని విజ్ఞప్తి

ప్రజాశక్తి - వేటపాలెం

గత పదిరోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు మగ్గం గుంటల్లో నీళ్లు ఊరుతున్నాయి. ఎంత తోడినా ఊట ఆగకపోవడంతో మగ్గాలపై పడుగులు నెమ్ముకున్నాయి. దీంతో పడుగులు పనికిరాక నష్టపోవడే కాకుండా పనుల్లేక రోజువారీ అవసరాలకు చేనేత కార్మికులు ఇబ్బందులు పడుతున్నారు. పనులు లేక చేనేత కార్మికులు పస్తులుండే పరిస్థితులు ఏర్పడ్డాయి. నియోజకవర్గంలో వేల మంది చేనేత వృత్తిని నమ్ముకుని జీవనం సాగిస్తున్నారు. ఉప వృత్తులపై ఆధారపడ్డ చేనేత కార్మికులకు పనుల్లేకుండా పోయాయి. ఆసు తిప్పటం, కండెలు చుట్టటం, అల్లు పట్టడం, అచ్చులు అతకడం, పడుగులు చేయడం వంటి పనులు నిలిచిపోయాయి. నియోజకవర్గంలో 45 వేల మంది మగ్గాలపై ఆధారపడి జీవిస్తున్నారు. గత 10రోజులకు పైగా వర్షాలకు దెబ్బతిన్న చేనేతల మగ్గాలు చూసిన అధికారులు లేరు. చేనేత కార్మికులకు జరిగిన నష్టాన్ని ఎవ్వరూ పట్టించుకోవడం లేదు. మగ్గాలపై ఉన్న పడుగులు ఇప్పట్లో నేత నేసేందుకు పనికిరావు.



మగ్గం గుంటల్లో ఊరుతున్న నీళ్లు

గుంటల్లో నీళ్లు ఆరి, ఎండ వాతావరణం వచ్చినా మగ్గాలపై ఉండే పడుగులు నేత నాణ్యత వచ్చే పరిస్థితి లేదు. దీంతో ఆ పడుగులు నష్టపోవాల్సి వస్తుందని చేనేత కార్మికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అమలు కాని ప్రభుత్వ హామీలు

కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలు ఏమీ అమలు కావడం లేదు. ఒక్కో చేనేత కుటుంబానికి రూ.25 వేల ఆర్థిక సహాయం చేస్తామని చెప్పిన హామీ ఎప్పటికి అమలవుతుందో తెలియదు. చేనేత కార్మికులకు నెలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్తు ఇస్తామని చెప్పారు. అధికారంలోకి వచ్చి ఏడాదైనా ఆచరణకు నోచుకోలేదు. ఇప్పటికైనా ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయడంతోపాటు తుఫానుకు మగ్గం గుంటల్లో నీళ్లు ఊరి పడుగులు నష్టపోయిన చేనేత కార్మికులకు, పన్నుల్లేక ఇబ్బందులు పడుతున్న చేనేత కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.

పత్తి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

ప్రజాశక్తి - యద్దనపూడి



పత్తి రైతు ఒ గురవయ్య

మండలంలోని సూరవరపుపల్లికి చెందిన ఒంటెల పెద్ద గురవయ్య 8 ఎకరాలు కౌలుకు తీసుకుని పత్తి సాగు చేశానని చెప్పాడు. వాగు ఒడ్డు పొలం కాబట్టి ఎకరం రూ.9వేల చొప్పున రూ.90వేలు కౌలు చెల్లించానని తెలిపారు. దున్నుటం, కూలీలకు ఎకరాకు రూ.9వేలు దుక్కికి ఖర్చయినట్లు తెలిపారు. బలం మందు రూ.3 వేలు ఖర్చు అయింది. విత్తనాలు రూ.2వేలు, నాటు కూలీ రూ.900, నీళ్ళ మందు రూ.2 వేలు, కలుపు తీతకు రూ.2 వేలు పెట్టుబడి కౌలు కాక రూ.25వేల వరకు పెట్టు బడయిందని చెప్పారు. మొంథా తుఫాన్ కారణంగా పొంగి పత్తి చేను మునిగినట్లు తెలిపారు. దాని కారణంగా పంట దెబ్బ తిన్నది. కనుక ప్రభుత్వం పంట నష్ట పరిహారం ఇచ్చి ఆదుకోవాలని కోరుతున్నాడు. వ్యవసాయ అధికారులు నష్టం అంచినా వేసి నష్ట పరిహారం ఇప్పించాలని కోరారు. రైతుకు గిట్టుబాటు ధర లభించక ప్రతి ఏటా ఎంతో కొంత నష్టం చవి చూడాల్సి వస్తుందని అన్నాడు. వ్యవసాయం చేయాలంటే భయం వేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు ఆలోచించి రైతును ప్రోత్సహించే విధంగా చూడాలని కోరారు. రైతులు, కౌలు రైతులు వ్యవసాయ మానివేస్తే తిండి గింజలకు ఇతర రాష్ట్రాలు, దేశాలపై ఆధార పడాల్సి వస్తుందని సామాజిక వేత్తలు అంటున్నారు.

అక్రమ వసూళ్లకు పాల్పడితే కఠిన చర్యలు

ప్రజాశక్తి - రేపల్లె

పట్టణంలోని కొంత మంది అక్రమార్కులు లేబర్ ఆఫీసర్ పేరు చెప్పి ఆన్లైన్ ఇన్స్‌పెక్షన్ చైల్డ్ లేబర్ కేసుల పేరుతో బ్లాక్ మెయిల్ చేసి డబ్బులు వస్తువులు చేస్తున్నారని, అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ ప్రభాకరరావు హెచ్చరించారు. హాస్పటల్స్, పాఠశాలలు చైల్డ్ లేబర్ కేసులు పేరుతో అధిక మొత్తంలో డబ్బులు వసూలు చేస్తున్న వారిపై చట్టపరమైన చర్యలతో పాటు, క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. లేబర్ ఆఫీస్ నుంచి వచ్చామని ఎవరైనా హాస్పటల్, స్కూల్స్‌లో చైల్డ్ లేబర్ కేసులు పేరుతో వచ్చిన వారెవరో గుర్తించాలని అన్నారు. పట్టణంలో 3వ చైల్డ్ లేబర్ కేసులు నమోదు చేసి రూ.70 వేల అపరాధ రుసం విధించినట్లు తెలిపారు. సెక్షన్ 3వ కేంద్ర ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కేసు నమోదు చేసినట్లు తెలిపారు. బాల కార్మికులు పనిచేస్తున్నట్లు ఎవరి దృష్టికైనా వస్తే లేదా అక్రమ వస్తువులకు పాల్పడిన, ఎవరైనా లేబర్ ఆఫీస్ నుంచి వచ్చామని అనుమానస్పదంగా కనిపిస్తే 94925 55163 నెంబర్‌కు ఫోన్ చేసి తెలపాలని కోరారు.

ద్రవరూప జీవన ఎరువులు ఉపయోగించాలి

ప్రజాశక్తి - రేపల్లె

రైతులు ద్రవరూప జీవన ఎరువులు ఉపయోగిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని ఎఒ ఎ మహేష్ బాబు పేర్కొన్నారు. మండలంలోని కారుమూరు, పేటేరు గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. రైతులు మోతాదుకు మించి రసాయన ఎరువులు వాడడం వల్ల భూమి చౌడుబారి సమతుల్యం దెబ్బతింటుందని, తద్వారా పంట దిగుబడి తగ్గుతుందని అన్నారు. పంటకు మేలు చేసే సేంద్రియ కర్బన పదార్థం తగ్గడం వల్ల మేలు చేసే సూక్ష్మజీవులు, వానపాముల క్రమంగా తగ్గి పంట దిగుబడి తగ్గుతుందని తెలిపారు. కార్యక్రమంలో వివిఎలు



మాట్లాడుతున్న రేపల్లె ఎఒ ఎ మహేష్‌బాబు

రాయల్ బాబు, యశస్విని, ఆరేపల్లి వీరబాబు, రెబ్బ కోదండ రాము, గోలి వెంకటేశ్వరరావు, సర్పంచ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వనమా వెంకటేశ్వరరావు

ఫార్మసీ విద్యార్థులకు కొత్త దిశ

ప్రజాశక్తి - వేటపాలెం

స్థానిక సెయింట్ ఆన్స్ ఫార్మసీ కాలేజీ ఆధ్వర్యంలో బి ఫార్మసీ మొదటి సంవత్సరం విద్యార్థులకు పరిచయం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు తెలిపారు. ప్రిన్సిపల్ డాక్టర్ వివి నాగేశ్వరరావు మాట్లాడుతూ ఫార్మసీ విద్య అంటే కేవలం ఔషధాల తయారీ మాత్రమే కాదని, ఆరోగ్య రంగానికి ఆధారమని వివరించారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని పరిశోధనా దృక్పథం పెంచుకోవాలని సూచించారు. ఆధునిక లాబొరేటరీలు, లైబ్రరీ, కంప్యూటర్ ల్యాబ్ వంటి సౌకర్యాలు ఉపయోగించుకుని ప్రతిభ నిరూపించాలని అన్నారు. డైరెక్టర్ డాక్టర్ సి సుబ్బారావు, ఇంజనీరింగ్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె జగదీష్‌బాబు, డాక్టర్ శామ్‌సన్, మేనేజర్ ఆర్‌వి రమణమూర్తి, కోఆర్డినేటర్ బి భవ్య పాల్గొన్నారు.

దాడి కేసులో నిందితులు అరెస్టు

ప్రజాశక్తి - చిన్నగంజాం

ఆవులదొడ్డి కొత్తగొల్లపాలెంలో మహిళపై దాడి జరిగిన ఘటన వెలుగులోకి వచ్చింది. గ్రామానికి చెందిన గడ్డం కోటేశ్వరమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ రమేష్ చెప్పిన వివరాల ప్రకారం ఫిర్యాదుదారి కుటుంబం, ముద్దాయిల కుటుంబం మధ్య పూర్వం వైరం ఉన్నట్లు తెలుస్తోందని అన్నారు. ఆ కారణంగా గత నెల 29న ఆమె ఇంటికి ముద్దాయిలు వెళ్లి ఆమెను తిట్టి, గొడవపడ్డారని తెలిపారు. ఆ సమయంలో మొదటి ముద్దాయి మద్దిన మణికంట శ్రీనివాసులు అలియాస్ మణికంట కర్రతో దాడి చేయగా ఆమె పెదవిపై గాయం కాగా మూడు పళ్ళు రాలిపోయాయినట్లు తెలిపారు. మిగిలిన ఇద్దరు ముద్దాయిలు మద్దిన సోమయ్య, మద్దిన సుజాత దాడికి సహకరించినట్లు తెలిపారు. ఈ ఘటనపై హెడ్ కానిస్టేబుల్ పి పేరలింగేశ్వరరావు కేసు నమోదు చేశారు. అనంతరం ఎస్ఐ సీలం రమేశ్ వైద్య ధృవీకరణ సేకరించి ప్రధాన నిందితుడు మద్దిన మణికంట శ్రీనివాసులను బుధవారం అరెస్టు చేసినట్లు తెలిపారు. అనంతరం చీరాల కోర్టులో హాజరుపర్చగా ఈనెల 19 వరకు రిమాండు విధించినట్లు తెలిపారు. మిగతా ఇద్దరు ముద్దాయిల కోసం గాలిస్తున్నట్లు తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి - బాపట్ల

జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి గాయాల పాలైన సంఘటన బాపట్ల, కర్లపాలెం మార్గంలో హీరో హొండా షోరూం వద్ద బుధవారం తెల్లవారు జామున చోటుచేసుకుంది. గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టడంతో గాయపడి అపస్మారక స్థితికి చేరిన వ్యక్తిని స్థానిక ఏరియా వైద్యశాలకు తరలించారు. వైద్యశాలలో చికిత్స పొందుతున్నట్లు తెలిపారు. గాయపడిన వ్యక్తి వివరాలు తెలిసినవారు 94407 96171, 89787 77298 నెంబరుకు తెలియజేయాలని సిఐ రాంబాబు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - బాపట్ల



మృతి చెందిన ఇమ్మడిశెట్టి ఆంజనేయులు

జాతీయ రహదారిపై కారు, ద్విచక్ర వాహనం ఢీ కొన్న ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన పట్టణ శివారులో బాపట్ల, సూర్యలంక బ్రిడ్జి వద్ద మద్దిబోయినవారి పాలెం సమీపంలో చోటు చేసుకుంది. రూరల్ ఎస్ఐ శ్రీనివాసులు తెలిపిన వివరాలు ప్రకారం చీరాల వైపు నుండి వస్తున్న కారు సర్వీస్ రోడ్డు దిగే క్రమంలో బైకును ఢీకొన్న ప్రమాదంలో పట్టణంలోని ఇమ్మడిశెట్టి వారిపాలెంకు చెందిన ఇమ్మడిశెట్టి ఆంజనేయులు (58) మృతి చెందారు. మృతదేహాన్ని ఏరియా వైద్యశాలకు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తలిపారు.

తుపాను బాధితులకు పరిహారం అందజేయాలి

బాపట్ల జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్

ప్రజాశక్తి - బాపట్ల

తుపాను ప్రభావంతో నష్టపోయిన కుటుంబాలకు ప్రభుత్వం ప్రకటించిన పరిహారాన్ని తక్షణమే అందజేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ తెలిపారు. నష్టపరిహారం పంపిణీపై కలెక్టరేట్ నుంచి జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ పరిహారం అందించాలన్నారు. పునరావాస కేంద్రాల్లో ఆశ్రయం పొందిన 9,956 మంది బాధితులకు నగదు, నిత్యావసర సరుకులు అందజేయాలన్నారు. 13,074 మంది మత్స్యకారులకు, 8,260 మంది చేనేతలకు పరిహారాన్ని అందజేయాలన్నారు. పరిహారం పంపిణీలో జాప్యం చేయరాదన్నారు. విధి నిర్వహణలో నిర్లిప్తంగా ఉంటే క్రమశిక్షణ చర్యలు తప్పవన్నారు. 24 గంటల్లో పంపిణీ ప్రక్రియ పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. రైస్ కార్డుల పంపిణీ ప్రక్రియ వేగంగా పూర్తి చేయాలన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్ కుమార్

పంట నష్టం సర్వే పూర్తి చేయాలి

పంట నష్టం అంచనా సర్వే వేగంగా పూర్తి చేయాలని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో 18 వేల 486 మంది రైతుల భూములు సర్వే చేసినట్లు వివరించారు. 36,818 ఎకరాల్లో పంటలకు నష్టం జరిగిందన్నారు. 12,888 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నట్లు అధికారుల నివేదికలు అందజేసినట్లు తెలిపారు. మిగిలిన ప్రాంతాలలో సర్వే ప్రక్రియ వేగంగా పూర్తి చేయాలని సూచించారు. సర్వే ప్రక్రియ పారదర్శకంగా ఉండాలన్నారు. గతేడాది పొగాకు పంట సాగు చేసిన వారి పొగాకు పంట పొలంలోనే ఉండి తడిచిపోతే వాటిని కూడా ప్రత్యేకంగా నమోదు చేయాలన్నారు. పొగాకు పంటపై సమగ్ర నివేదికను ప్రభుత్వానికి పంపుతామన్నారు. ఈ క్రాప్ బుకింగ్ లో ఇప్పటివరకు జిల్లాలో 1,66,263 ఎకరాల పంటల సాగు వివరాలను నిక్షిప్తం చేశామన్నారు. ఈ- క్రాప్ నమోదుపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా సంయుక్త కలెక్టర్ భావన విశిష్ట, వ్యవసాయ శాఖ ఏడీ అన్నపూర్ణ, డీఎస్ఓ జమీర్ బాషా, జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి రమేష్ బాబు, మార్క్‌ఫెడ్ జిఎం కరుణశ్రీ, తహశీల్దార్లు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

ఇంటి పన్నులు ఆన్‌లైన్ ద్వారా స్వీకరించాలి

ప్రజాశక్తి -బాపట్ల

2025-26 ఆర్థిక సంవత్సరం నుంచి ఇంటి పన్నులు ఆన్‌లైన్ ద్వారా స్వీకరించాలని బాపట్ల డివిజనల్ అభివృద్ధి అధికారి విజయలక్ష్మి తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇంటి పన్నులు వసూలులో పారదర్శకత ఉండాలన్నారు. స్వర్ణ పంచాయతీ యాప్ ద్వారా ఆన్ లైన్ మాత్రమే పన్నులు స్వీకరించాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. పంచాయతీ కార్యదర్శులు మాన్యువల్ గా ఇంటి పన్నులు వసూలు చేయకుండా ఆన్‌లైన్ ద్వారా వసూలుపౌ ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. పన్నులు వసూలు వేగవంతం చేయాలన్నారు. స్వమిత్వా సర్వేలో పురోగతి చూపాలన్నారు. వర్క్ ఫ్రం హోం, సిటిజన్ ఇకెవైసి, విద్యార్థులకు ఆధార్ అప్ డేషన్ కార్యక్రమాలను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో ఎంపిడిఒ బాబూరావు, గ్రామపంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న విజయలక్ష్మి

కలెక్టర్‌ను కలిసిన ప్రభుత్వ న్యాయవాది

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

జిల్లా కలెక్టర్ పి.రాజాబాబును ఒంగోలు ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్, సెషన్స్ జడ్జిస్ కోర్టు ప్రభుత్వ న్యాయవాదిగా నియమితులైన జి.శ్రీకాంత్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఛాంబర్‌లో బుధవారం కలెక్టర్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. శ్రీకాంత్ ప్రభుత్వం తరపున సివిల్ కేసులకు కోర్టులో ప్రాతినిధ్యం వహిస్తారు. ఆయన మూడేళ్ల పాటు లేదా సర్వీస్ నుంచి ప్రభుత్వం తొలగించే వరకు (ఏది ముందుగా జరిగినా అప్పటి వరకూ) ప్రభుత్వ న్యాయవాదిగా కొనసాగుతారు.



కలెక్టర్‌కు పుష్ప గుచ్ఛం అందజేస్తున్న శ్రీకాంత్

పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

ప్రజాశక్తి - ఒంగోలు సిటీ

మొంథా తుపాను ప్రభావంతో నష్టపోయిన రైతులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని సిపిఐ ఎంఎల్‌న్యూ డెమోక్రసీ డిమాండ్ రాష్ట్ర అధికార ప్రతినిధి చిట్టిపాటి వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. ఒంగోలులోని మాదాల నారాయణస్వామి భవనంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తుపాను కారణంగా రైతులు నష్టపోయినట్లు ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి ప్రదర్శిస్తుందన్నారు.. 25 జిల్లాల్లో పంటలు, ఆస్తులు దెబ్బతిన్నట్లు తెలిపారు. 16 లక్షల ఎకరాల్లో పంట జరిగినట్లు తెలిపారు. వరి పంట 11 లక్షల ఎకరాలు, బొప్పాయి, పత్తి, మినుము, అరటి వంటి పంటలు 5 లక్షల ఎకరాల్లో దెబ్బతిన్నట్లు తెలిపారు. పంట 33 శాతం దెబ్బతిన్నప్పుడే నష్టంగా పరిగణిస్తామన్న ప్రభుత్వ విధానం అన్యాయమని తెలిపారు. ఈ సమావేశంలో ప్రగతిశీల మహిళా సంఘం రాష్ట్ర కార్యదర్శి బి.పద్మ, పిడిఎస్‌యు రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజశేఖర్, అరుణోదయ రాష్ట్ర అధ్యక్షుడు జాలన్న, కార్మిక నాయకుడు సి.తిరుమలరావు, పివైఎల్ జిల్లాఅధ్యక్షుడు వి.రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

సంపదను కొల్లగొడుతున్న...

కార్పొరేట్ శక్తులను ప్రతిఘటించాలి

వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు

ప్రజాశక్తి-మార్కాపురం

మతోన్మాదుల అండతో ప్రజల్ని మౌఢ్యంలో ముంచి.. దేశ సంపదను కార్పొరేట్ శక్తులు అడ్డగోలుగా దోచు కుంటున్నాయని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు ధ్వజమెత్తారు. సంపద కొల్లగొడుతున్న కార్పొరేట్ శక్తులను ప్రతిఘటించాలని విజ్ఞప్తి చేశారు. స్థానిక ఎన్‌జిఒ హోమ్‌లో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా స్థాయి కార్యకర్తల శిక్షణా తరగతులు సంఘం జిల్లా అధ్యక్షుడు నెరుసుల వెంకటేశ్వర్లు అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా 'మతం మతోన్మాదం-కార్పొరేట్ల కలయిక' అనే అంశంపై సుబ్బారావు మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ ప్రభుత్వం అబద్ధాలు, అసత్యాలతో ప్రజల్ని మభ్యపెడుతూ, మోసపు మాటలతో పరాధీనత వైపు నడిపిస్తున్న దన్నారు. చరిత్రను వక్రీకరించి మత, మూఢ భావాలను ప్రజల మెదడులోకి చొప్పిస్తున్నారన్నారు. మతం, దేవుళ్ల, పూజలు అనేవి వ్యక్తిగతమైనవని అన్నారు. రాజకీయాలలో మతాన్ని చొప్పించి మెజార్టీ ప్రజల ఓట్లు కొల్లగొట్టేందుకు ఉన్మాదాన్ని, అల్లర్లను సృష్టించటం అత్యంత దుర్మార్గ మన్నారు. ఈ పరిస్థితులను ఆసరా చేసుకుని మతోన్మాదులు, కార్పొరేట్ శక్తులు కలిసి ప్రకృతి వనరులను, ప్రభుత్వ రంగ సంస్థలను, ప్రజా సంపద మొత్తాన్ని అప్పనంగా దోచుకుంటున్నారన్నారు. ఒకవైపు ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ చేస్తూ, మరోవైపు వ్యవసాయ రంగాన్ని సంపూర్ణంగా సంక్షోభంలోకి నెడుతున్నారని అన్నారు. అమెరికా ఉత్పత్తులపై మనం ఆధారపడితే క్రమంగా వారి ఆధిపత్యంలోకి మన దేశం పోతుందని, దేశ ఆర్థిక వ్యవస్థకు నష్టం కలిగిస్తున్న ట్రంపు టారిఫ్ విధానాన్ని మోడీ ప్రభుత్వం వ్యతిరేకించాలని విజ్ఞప్తి చేశారు. ఏ స్వార్థ ప్రయోజనాల కోసం మోడీ ప్రభుత్వం ట్రంపు టారిఫ్ పట్ల మౌనం దాలుస్తున్నారో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ట్రంపు సుంకాల నుంచి దేశ ఆర్థిక వ్యవస్థను కాపాడుకోవాలని, సామ్రాజ్యవాద ఆదిపత్యాన్ని ప్రతిఘటించాలని విజ్ఞప్తి చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు మాట్లాడుతూ ట్రంప్ ఆదేశాలతో కేంద్ర ప్రభుత్వం పత్తి దిగుమతులపై సుంకాలు తొలగించి నందున వ్యవ సాయదారులతో పాటు వస్త్ర పరిశ్రమపై తీవ్ర ప్రభావం పడుతుందన్నారు. వేలాదిమంది ఉద్యోగాలు కోల్పోతారని అన్నారు. మనదేశంలో ఉత్పత్తి అయ్యే రొయ్యలపై అమెరికాలో టాక్స్‌లు పెంచినందున చేపలు, రొయ్యల చెరువులపై ఆధారపడుతున్న రైతులు, కూలీలు తీవ్రంగా నష్టపోతారన్నారు. రష్యా నుంచి మన దేశం ఆయిల్ దిగమతులు చేసుకుంటున్నందుకు సుంకాలు వేస్తున్నానని ట్రంప్ మాట్లాడటం అభ్యంతరకరమన్నారు. ఎలాంటి పన్నులు లేకుండా వ్యవసాయ ఉత్పత్తులన్నీ ఇండియాకు దిగుమతి చేసేందుకు మోడీ ప్రభుత్వం ఒప్పుకున్నదని ట్రంపు ప్రకటించడం పట్ల మోడీ మౌనం దాల్చడం ఆందోళన కరమన్నారు. కార్యక్రమ ప్రారంభానికి ముందుగా సంఘ పతాకాన్ని జిల్లా ఉపాధ్యక్షుడు గుమ్మా బాలనాగయ్య ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు బడుగు వెంకటేశ్వర్లు, కంకణాల వెంకటేశ్వర్లు, వి.మోజెస్, కొమ్మాలపాటి మాల్యాద్రి, ఉబ్బా వెంకటేశ్వర్లు, తురకా ఏడుకొండలు, బి జనార్ధన్, పారాబత్తిన శ్రీను, ఎం సంపూర్ణ, చిలకా కోటమ్మ, రమేష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న దడాల సుబ్బారావు

తుపానులో సమర్థంగా పనిచేసిన వారికి కృతజ్ఞతలు

ప్రజాశక్తి బాపట్ల

మొంథా తుపాను ప్రభావాన్ని సమర్థంగా ఎదుర్కోవడానికి కృషి చేసిన అందరికీ జిల్లా కలెక్టర్ వి. వినోద్ కుమార్ బుధవారం ఓ ప్రకటనలో కతజ్ఞతలు తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశానుసారం బాపట్ల జిల్లాలో ఎలాంటి ప్రాణ నష్టం జరగకుండా పనిచేసిన వారందరికీ ప్రత్యేకంగా కతజ్ఞతలు తెలిపారు. వాతావరణ శాఖ నుంచి హెచ్చరిక రాగానే జిల్లా యంత్రాంగమంతా అప్రమత్తమైందన్నారు. జాగ్రత్తగా ఉండాలని ఎప్పటికప్పుడు ఇచ్చిన సూచనలను జిల్లా ప్రజలంతా పాటించడం సంతోష దాయకమన్నారు. మొంథా తుపానును ఎదుర్కొనేందుకు కృషి చేసిన జిల్లా ప్రజలు, ప్రజా ప్రతినిధులు, అధికారులు, పాత్రికేయులు, మీడియా ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలకు కలెక్టర్ ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు.

దళితులపై దాడి దారుణం : వైసిపి

ప్రజాశక్తి - ఒంగోలు సిటీ

చీమకుర్తి మండలం బండ్లమూడి గ్రామంలో దళితులపై అదే గ్రామానికి చెందిన పెత్తందారులు దాడి చేయడం దారుణమని వైసిపి నాయకుల ఆగ్రహం వ్యక్తం చేశారు. దాడిలో గాయపడి ఒంగోలు జిజిహెచ్‌లో చికిత్స పొందుతున్న బాధితులను మాజీ మంత్రి, సంత నూతలపాడు నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ మేరుగు నాగార్జున , వైసిపి ఒంగోలు నియోజకవర్గ సమన్వయకర్త చుండూరి రవిబాబు, ఒంగోలు పార్లమెంట్ పరిశీలకులు బత్తుల బ్రహ్మానందరెడ్డి తదితతరులు బుధవారం పరామర్శించారు. బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యాధికారులను కోరారు. అనంతరం మీడియాతో మాట్లాడిన నాయకులు దళితులపై దాడిని తీవ్రంగా ఖండించారు. దళితులపై జరుగుతున్న దాడులు సమాజానికి మాయనిమచ్చ అని తెలిపారు. బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలన్నారు. నిందితులపై ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.గ్రామంలో శాంతి, సామరస్యం నెలకొనేలా పోలీసులు పటిష్ట భద్రత ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైసిపి సంత నూతలపాడు నియోజకవర్గ పరిశీలకులు బొట్ల రామారావు, కెవి. రమణారెడ్డి, చీమకుర్తి ఎంపిపి యద్దనపూడి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



బాధితుడిని పరామర్శిస్తున్న వైసిపి నాయకులు